# గీటురాయి

సహజీవన భావనల పావురాయి

వారపత్రిక 2-1-2026 ₹15/-


# ఉన్నావా? అసలున్నావా?









గీటురాయి
మానవీయ భావనల సొభగురాయి
వారపత్రిక
**GEETURAI WEEKLY**
Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

**Our Bank A/c Details:**
Geeturai Weekly, A/c No.1042789768
IFSC : CBIN0282407, Central Bank of India
Noor Khan Bazar Branch, Hyderabad

సంపుటి: 48 సంచిక: 1 హైదరాబాద్
శుక్రవారం 2 జనవరి 2026 రూ.15-00
రజ్జబ్ 12 1447 హిజ్రీ


**తొలిగీటు**

**ఇష్టమైంది తినండి. నచ్చిన దుస్తులు ధరించండి. అయితే మీలో పొగరుగాని, అనవసరపు వ్యయం చేసే బుద్ధిగాని దారి చేసుకోకూడదు.**

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**





22

**పాపభీతి**

## లోపల...


| | | |
|---|---|---|
| పాలస్తీనా | ...... | 04 |
| ఉన్నావా? అసలున్నావా?? | ...... | 05 |
| కాలం సాక్షిగా జీవితం... | ...... | 10 |
| జ్ఞాన జ్యోతులు వెలిగించిన విద్యాబాంధవి | ...... | 12 |
| మతం పేరుతో మారణహోమం | ...... | 14 |
| గతంలోకి ఒక చూపు – 9 | ...... | 16 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు (సహీహ్ బుఖారీ అనువాదం) | ...... | 19 |
| అశాంతి కడలిలో అల్లాహ్ స్మరణ | ...... | 20 |
| కుటుంబ విలువల పునర్నిర్మాణం అవసరం | ...... | 24 |
| సృష్టికర్తను గుర్తించండి | ...... | 26 |
| ఆత్మపరిశీలన వెలుగులో నూతన ప్రయాణం | ...... | 28 |
| దివ్యమైన దానిమ్మ | ...... | 30 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |
| 2026 హజ్ యాత్రకు ముందు ఆరోగ్యానికి ప్రాధాన్యం | ...... | 34 |


**మాయమౌతున్న మానవత...**



మాయమవుత ఉన్నది
మనుషుల్లో మానవత
మాయదారి రోగమోలె
పెరుగుతోంది దానవత!

కులంపేర మతంపేర
తెస్తున్నరు విభజన
మతోన్మాద శక్తులకు
చెయ్యొద్దుర భజన!!

**– యం.డి. ఉస్మాన్ ఖాన్**

# ఆలోచన

# పాలస్తీనా

**2023లో** ఇస్రాయీల్‌పై హమాస్ దాడి తర్వాత రెండేళ్ళు గడిచి పోయాయి. ఈ రెండేళ్ళలో హమాస్‌ను అంతం చేసే సాకుతో ఇస్రాయీల్ సైన్యం గాజాలోని అమాయక పౌరులను హతమార్చింది. పసిపిల్లలను కాల్చి చంపింది. ఆసుపత్రులు, స్కూళ్ళను కూల్చింది. కాని హమాస్ బలాన్ని తగ్గించలేకపోయింది. హమాస్ పట్టుకున్న బందీలను విడిపించుకోలేకపోయింది. ఈ మధ్య కాలంలో ఈరాన్‌తో గిల్లికజ్జాలు పెట్టుకుని అమెరికా జోక్యంతో ఎట్టకేలకు బయటపడింది. గాజాపై ఇస్రాయీల్ కొనసాగిస్తున్నది యుద్ధం కాదు నరసంహారం అని అనేకమంది ప్రపంచవ్యాప్తంగా విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో గాజాలో యుద్ధవిరమణ, శాంతిస్థాపనకు అమెరికా ముందుకు వచ్చింది.

ఇప్పుడు ఈ శాంతి ప్రయత్నాల అసలు రంగు బయటపడుతోంది. 'ప్రాజెక్ట్ సన్‌రైజ్' పేరుతో పాలస్తీనా గురించిన ఈ ప్రతిపాదన వివరాలను వాల్ స్ట్రీట్ జర్నల్ వెల్లడించింది. యుద్ధంతో శిథిలాల కుప్పగా ఛిన్నాభిన్నమైన గాజాను రాబోయే రెండు దశాబ్దాలలో హైటెక్, విలాసవంతమైన విహారప్రాంతంగా మార్చాలన్నది అసలు లక్ష్యం.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నర్, అమెరికా మధ్యప్రాచ్య రాయబారి స్టీవ్ విట్కాఫ్ నేతృత్వంలోని బృందం ఈ ప్రాజెక్ట్ తయారు చేసింది. దీని అంచనా వ్యయం మొదటి 10 ఏళ్లలో 112 బిలియన్ డాలర్లు అని అమెరికా అధికారులను ఉటంకిస్తూ వాల్ స్ట్రీట్ జర్నల్ పేర్కొంది. ప్రాథమికంగా, అమెరికా 60 బిలియన్ డాలర్లు అందించి ఈ కార్యక్రమానికి అండగా నిలుస్తుందని, ప్రాజెక్ట్ పురోగతి సాధించే కొద్దీ గాజా తన వంతు నిధులను స్వయంగా సమకూర్చుకుంటుందని నివేదిక తెలిపింది.

శిథిలాలను తొలగించడం, గాజాను పునర్నిర్మించడం, గాజా ప్రజల పేదరికాన్ని నిర్మూలించడం తదితర దశలు ఈ ప్లానులో ఉన్నాయి. ఈ ప్లాన్ టర్కీ ఈజిప్టులతో సహా సంపన్న గల్ఫ్ దేశాలకు చూపించి నట్లు తెలుస్తోంది. గాజా పునర్నిర్మాణానికి సగానికి పైగా అమెరికానే చెల్లిస్తుందన్న వార్తలను అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ బ్యూరో ఆఫ్ నియర్ ఈస్టర్న్ అఫైర్స్ ఖండించింది. కాబట్టి ఈ వార్త నిజం కాదని అనుకోగలమా?

పాలస్తీనా ప్రజలను అక్కడి నుంచి శాశ్వతంగా తొలగించి, గాజాను అమెరికా స్వాధీనం చేసుకుని, అక్కడ "మిడిల్ ఈస్ట్ రివీరా" నిర్మిస్తామని ఈ ఏడాది మొదట్లో ట్రంప్ చెప్పారన్నది కూడా మరిచి పోరాదు. కాని పలుదేశాలు తీవ్రంగా విమర్శించిన తర్వాత గాజా ప్రజలను శాశ్వతంగా తొలగించాలనే విషయంలో ట్రంప్ వెనక్కి తగ్గాడు. గాజా ప్రజలను అక్కడి నుంచి తరలించడం కన్నా ఇస్రాయీల్‌కు కావలసిందేముంది. ఆ తర్వాత గాజా పూర్తిగా ఇస్రాయీల్ స్వంతమైపోతుంది.

ఈ ప్లాన్ ప్రకారం.. శిథిలాలను, పేలని బాంబులను హమాస్ సొరంగాలను తొలగించాలి. గాజా ప్రజల కోసం తాత్కాలిక షెల్టర్లు, వైద్య కేంద్రాలను ఏర్పాటు చేయాలి. కాని ఈ పునర్నిర్మాణం జరుగుతున్నప్పుడు గాజా ప్రజలు ఎక్కడ బతకాలన్నది ప్లానులో లేదు.

శాశ్వత నివాసాలు, ప్రభుత్వ వసతులు, మౌలిక సదుపాయాల నిర్మాణం పూర్తయిన తర్వాత విలాసవంతమైన రివిరా నిర్మాణం మొదలవుతుంది.

ఈ ప్రణాళిక అమల్లోకి రావాలంటే హమాస్ తప్పనిసరిగా ఆయుధాలు త్యజించాలి. హమాస్ దీనికి సిద్ధంగాలేదు. గాజా పునరావాసం ప్రారంభం కావాలంటే హమాస్ ఆయుధాలు వీడాలని అమెరికా, ఇస్రాయీల్ రెండూ పట్టుబడుతున్నాయి.

ప్లాన్ రెండో దశలో భాగంగా, ఇస్రాయీల్ గాజా నుండి వెనక్కి వెళ్ళాలి. హమాస్ స్థానంలో తాత్కాలిక అధికార యంత్రాంగం పాలన చేపట్టాలి. అంతర్జాతీయ భద్రతా బలగాలను మోహరించాలి. కానీ, కాల్పుల విరమణ ఒప్పందం విషయంలో ఇరుపక్షాలు ఉల్లంఘిస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత వారం ఇస్రాయీల్ సీనియర్ హమాస్ కమాండర్ రాయెద్ సాద్‌ను హత మార్చింది. దీంతో కాల్పుల విరమణ కొనసాగడం కష్టమయ్యింది.

హమాస్ ఆయుధాలు త్యజించాలనే నిబంధన ఈ మొత్తం ప్లానులో మరో అడ్డంకి. అంతర్జాతీయ సమాజం విమర్శిస్తున్నా గత రెండేళ్లుగా ఇస్రాయీల్ దళాలు గాజాను నాశనం చేసిన తీరు చూసిన వారికి చాలా సందేహాలున్నాయి. ఇదంతా కేవలం ఆ ప్రాంతంలోని ప్రజలను ఖాళీ చేయించే నాటకమా అనే అనుమానాలు అలుముకుంటున్నాయి. ఈ అనుమానాలు ఏ స్థాయిలో ఉన్నాయంటే హమాస్ కూడా ఈ కుట్రలో భాగమేనా? అని కొందరంటున్నారు. ఎందుకంటే హమాస్‌కు ఇస్రాయీల్ ఎప్పుడెప్పుడు ఎలా మద్దతిచ్చిందో చాలా మందికి తెలుసు.

గాజా ప్రజలను అక్కడి నుంచి తొలగించి విలాసవంతమైన, విహార ప్రాంతంగా మార్చి ఎడారి వినోద విడిదిగా తయారు చేయాలనేది మొదటి నుంచి ఉన్న పథకం. ఇందులో పాలస్తీనీయులకు చోటు లేదు. ఇలా చేస్తే ఇస్రాయీల్ కన్నా ఎక్కువ సంతోషించేవారెవరూ ఉండరు. ఎందుకంటే గాజా ప్రజలను అక్కడి నుంచి తొలగించిన తర్వాత ఇస్రాయీల్ ఇష్టారాజ్యమే అక్కడ నడుస్తుంది. తమ విలాసాల వినోదాల విడిది నిలయాలు కట్టుకోడానికి ప్రజలను వారి మాతృభూమి నుంచి పెకిలించి పారేసే ఈ పథకాల వాస్తవాలను ప్రపంచదేశాలు గుర్తించడం అవసరం. ✤

అబ్దుల్ వాహెద్




# ఉన్నావా? అసలున్నావా?

**"ఉన్నావా? అసలున్నావా?"** పాత సినిమా పాటలపై ఆసక్తి ఉన్నవారు ఈ పాట బహుశా వినే ఉంటారు. 1973లో వచ్చిన 'భక్తతుకారాం' సినిమాలోని చాలా చక్కని పాట ఇది.

దేవుడున్నాడా? ఎప్పుడో ఒకప్పుడు ఏదో ఒక సందర్భంలో చాలా మంది మనసులో ఈ ప్రశ్న కదలాడి ఉండవచ్చు. నేటి పరుగుల ప్రపంచంలో ఈ ప్రశ్న గురించి ఆలోచించే తీరికే లేకుండా బతికేస్తున్న వారు చాలా మంది ఉండవచ్చు.

ఈ నేపథ్యంలో, న్యూఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్బులో 'దేవుడున్నాడా' అనే అంశంపై జరిగిన చర్చ ఒక కొత్త పొద్దు. కష్టమొచ్చినప్పుడు మాత్రమే "ఉన్నావా?" అని దేవుడిని నిలదీసే సగటు మనిషి మొదలు, విశాల విశ్వంలో మనిషి ఎవరు? అని ఆలోచించే తార్కిక మేధావుల వరకు అందరి దృష్టిని ఈ చర్చ ఆకర్షించింది. ఈ చర్చ గురించి అన్నింటికన్నా ముందుగా చెప్పుకోవలసిన విషయం, విద్యావంతులు జరిపే నాగరికమైన చర్చ ఎలా ఉండాలో ఈ చర్చ ఒక పాఠంలా ఉపయోగపడుతుంది. నేడు టీవీ తెరపై చూసే చర్చలతో దీనిని పోల్చి చూసుకుంటే ఈ తేడా మనకు స్పష్టంగా తెలుస్తుంది.

జర్నలిస్ట్ సౌరభ్ ద్వివేది ఈ చర్చను మోడరేటర్‌గా నిర్వహించారు. చర్చలో ప్రముఖ కవి, హిందీ సినిమాలకు అనేక అద్భుతమైన పాటలందించిన జావేద్ అక్తర్ దేవుడు లేడు అని వాదిస్తే, ప్రముఖ ఇస్లామీయ పండితుడు ముఫ్తీ షమాయిల్ నద్వీ దేవుడున్నాడని వాదించారు.

ఈ చర్చలో ఎవరు గెలిచారన్నది అప్రస్తుతం. కాని ఈ చర్చ అనేక మందిలో ఆలోచనల ప్రకంపనాలు సృష్టించిందనడం యదార్థం. ఈ చర్చ గురించి మరో ముఖ్యమైన విషయమేమిటంటే, మదరసాల్లో చదువుకున్న వారంటే చిన్నచూపు చూసే అలవాటున్నవారు ఈ చర్చ చూసిన తర్వాత తమ అలవాటు మార్చుకోక తప్పదు. ముఫ్తీ షర్మాయిల్ నద్వీ వాదనా పటిమ అందరినీ ఆకట్టుకుందని ఈ చర్చపై వచ్చిన వ్యాఖ్యలను చూస్తే తెలుస్తుంది. సహజంగానే జావేద్ అక్తర్ తన భాషాప్రతిభ, తన జీవితానుభవాలతో అందరినీ ఆకట్టుకునేలా మాట్లాడారు. ప్రస్తుత వాతావరణంలో ఇలాంటి చర్చలు ఎంతో అవసరం. భిన్న భావాల మధ్య, భిన్న సిద్ధాంతాల మధ్య ఇలాంటి చర్చలే ఒక ఆరోగ్యవంతమైన సమాజానికి కావాలి. నిజానికి ఇలాంటి చర్చలు అప్పుడప్పుడు విదేశాల్లో జరుగుతుంటాయి. ఉదాహరణకు మెహదీ హసన్, రిచర్డ్ డాకిన్స్‌ల మధ్య ఇలాంటి చర్చే జరిగింది.

ఈ చర్చకు సంబంధించి కొన్ని విషయాలు ఇక్కడ మనం ముచ్చటించుకుందాం. దేవుడున్నాడా అనే చర్చ కేవలం దేవుడి ఉనికి ఉందా లేదా అనేది నిరూపించడానికి మాత్రమే పరిమిత మయ్యింది. ఇది ఏ మతానికీ సంబంధించిన చర్చ కాదు. ఆస్తికత్వం, నాస్తికత్వాల మధ్య చర్చ అనేది మొదటే స్పష్టంగా చెప్పేశారు. ఈ చర్చలో తత్వశాస్త్రం, నైతికత, విజ్ఞానశాస్త్రాల అనేక అంశాలు ప్రస్తావనకు వచ్చాయి.

అయితే ఈ చర్చలో సమయాభావం వల్ల బహుశా కొన్ని విషయాలు చాలా మందికి అర్థం కాకుండా ఉండి పోయాయని పిస్తుంది. ఉదాహరణకు కంటింజెంట్ రియాలిటీ గురించి ముఫ్తీ షమాయిల్ మాట్లాడుతున్నప్పుడు జావేద్ అక్తర్ తనకు కంటింజెంట్ రియాలిటీ అంటే ఏమిటో అర్థం కాలేదని అన్నారు. ముఫ్తీ తన శైలిలో క్లుప్తంగా వివరించారు. ఆధారిత వాస్తవికతకు సంబంధించి మరిన్ని వివరాలు ఆ చర్చలో వస్తే బాగుండేది.

అన్నింటికన్నా ముందు ఈ చర్చలో సైన్సు పునాదిగా వాదనలను స్వీకరించడం సాధ్యం కాదని, అలాగే మతగ్రంథాల ఆధారంగా కూడా వాదనలు స్వీకరించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. కేవలం తార్కికంగా మాత్రమే వాదనలు కొనసాగాలని నిర్ణయించుకున్నారు. సైన్సు పునాదిగా లేని ఏ వాదన కూడా స్వీకారయోగ్యం కాదని కొందరు ప్రేక్షకుల అభిప్రాయాలు ముందుకు వచ్చాయి. కాని కాస్త లోతుగా ఆలోచిస్తే సైన్సు ఆధారంగా ఇలాంటి అంశాలు చర్చించడంలో ఔచిత్యం కనిపించదు. ఎందుకంటే, సైన్సు ప్రయోగాలపై, పరిశీలనలపై ఆధారపడి వాస్తవాలను ఆవిష్కరించే ప్రయత్నం చేస్తుంది. ఈ క్రమంలో నేడు సైన్సు నిజమని నమ్మిన మాట కొన్నాళ్ళ తర్వాత నిజం కాకపోతే సైన్సు నిర్మొహమాటంగా ఆ విషయం ఒప్పు కుంటుంది. కాబట్టి నేడు సైన్సు పరిశీలనల ఆధారంగా చెప్పిన మాటను పునాదిగా చేసుకుని అలౌకిక అంశాలను చర్చించడం సరయిన పద్ధతి కాదు. ఈ విషయంలో చర్చలో పాల్గొన్న ఇద్దరు ప్రముఖులు అంగీకారానికి రావడం కూడా నాగరిక చర్చలు ఎలా ఉండాలనే పాఠం చెబుతున్న వాస్తవం. ఉదాహరణకు న్యూటన్ క్లాసికల్ మెకానిక్స్ తర్వాత ఐన్ స్టైయిన్ సాపేక్షసిద్ధాంతం, క్వాంటం మెకానిక్స్ వచ్చాయి. క్వాంటం మెకానిక్స్ న్యూటన్ అవగాహనను సవాలు చేసిందంటే తప్పులేదు. సైన్సు గతిశీల మైనది. నేడు సైన్సు చెప్పిన మాట రేపు ఉండకపోవచ్చు. రేపు మాటమార్చి మరో మాట చెప్పవచ్చు. సైన్సును వాదనకు ఉపయోగించుకోవడం వేరు, సైంటిఫిక్ మెథడాలజీని వాదనకు ఉపయోగించుకోవడం వేరు. ఇక్కడ సైన్సును ఉపయోగించుకో రాదని మాత్రమే చెప్పారు కాని సైంటిఫిక్ మెథడాలజీ విషయంలో కాదని కూడా గుర్తించాలి.

ముఫ్తీ షమాయిల్ నద్వీ తన వాదనలో ప్రముఖంగా ప్రస్తావించిన కంటింజెంట్ రియాలిటీ, ఇన్ ఫినిట్ రిగ్రెషన్లకు జావెద్ అక్తర్ తరఫున ఎలాంటి జవాబు రాలేదు. ఆయన నిజాయితీగా ఈ పదాలేమిటో తనకు అర్థం కాలేదని కూడా చెప్పేశారు. ఇన్ ఫినిట్ రిగ్రెషన్ సాధ్యం కాదని, ఎక్కడో ఒకచోట ఆగడం అవసరమని ముఫ్తీ చెప్పిన మాటలు బహుశా జావేద్ గారికి అర్థం కాలేదు. ఆయన తన వాదనలో ఎక్కడా ఆగవలసిన అవసరమేమీ లేదు. ఎందుకు ఆగాలి అని ఎదురు ప్రశ్నించారు. ప్రేక్షకుల నుంచి ఈ విషయంలో ముఫ్తీ యాసిర్ నదీమ్ ఈ ప్రశ్న మరో రూపంలో కూడా అడిగారు. జావేద్ గారు, మీరు ఒక కవి, మీ గురువుగారి వల్ల మీకు కవిత్వ నైపుణ్యాలు వచ్చా యనుకుందాం, మీ గురువుగారికి, ఆయన గురువుగారి వల్ల కవిత్వ నైపుణ్యం తెలిసింది, ఆ గురువుగారికి తన గురువు వల్ల... ఇలా నిరంతరాయంగా ఈ శృంఖల కొనసాగుతుందా? అలా కొనసాగితే మీరు ఇప్పుడు అసలు కవిగా ఉండే అవకాశమే లేదు కదా అని అడిగిన ప్రశ్న కూడా జావేద్ గారికి అర్థం కాలేదు. ఎందుకు కొనసాగకూడదు, ఎందుకు ఆగిపోవాలి అంటూ ఆయన ప్రశ్నించారు. కంటింజెంట్ రియాలిటీ లేదా కంటింజెంట్ బీయింగ్ అనే పదాలపై చర్చ పూర్తి స్థాయిలో జరగనే లేదు.

ఇక్కడ ఈ విషయాన్ని కొంత అర్థం చేసుకునే ప్రయత్నం చేద్దాం. చిన్న ఉదాహరణలు తీసుకుందాం.

ఉదాహరణ 1: నాకు ఆకలేస్తుందనుకుందాం. నా ముందు చక్కని భోజనం ఉంది. కాని నేను తినాలంటే నాకు ఆఫీసులో నా మేనేజర్ అనుమతి కావాలి. ఆ మేనేజర్ నాకు అనుమతి ఇవ్వాలంటే, మా డైరెక్టర్ అనుమతి ఆయనకు కావాలి. ఆ డైరెక్టర్ అనుమతి ఇవ్వాలంటే ఆయనకు చైర్మన్ అనుమతి కావాలి. ఇలా ఒకరు మరొకరిపై ఆధారపడే ఈ శృంఖల ఏదో ఒక చోట ఆగితేనే అనుమతి అనేది ఈ చైన్లో చివరకు నా వరకు వచ్చి నేను హమ్మయ్య అనుకుని నా భోజనం తినగలను. ఈ అనుమతి కోసం ఒకరు మరొకరి అనుమతి కోసం ఎదురు చూసే పరిస్థితి నిరంతరాయంగా కొనసాగుతూనే ఉంటే అనుమతి ఇవ్వడం అనేది జరగనే జరగదు. నేను నా భోజనం తినలేను. కాబట్టి ఇది ఎక్కడో ఒక చోట ఆగడం అవసరం.

ఉదాహరణ 2: నేను ఉనికిలో ఉన్నాను అనేది ఒక వాస్తవం. ఈ వాస్తవం కళ్ళారా అందరూ చూడగలరు. నేను ఉనికిలో ఉండడానికి కారణం నా తల్లిదండ్రులు. నా తల్లిదండ్రులను కూడా చాలా మంది నా పరిచయస్తులు చూసే ఉంటారు. నా తల్లిదండ్రులు ఉనికిలో ఉండడానికి కారణం నా తాత, నాయనమ్మ, అమ్మమ్మ (గ్రాండ్ పేరెంట్స్). వారు లేకపోతే నేను లేను. కాని వారిని చాలా మంది చూసి ఉండకపోవచ్చు. అయినా వారు ఒకప్పుడు ఉనికిలో ఉన్నారు కాబట్టే నేను ఉనికిలో

ఉన్నానన్నది కాదనలేని సత్యం. అలాగే నా గ్రాండ్ పేరెంట్స్ ఉనికిలో ఉండడానికి వారి తల్లిదండ్రులు కారణం. ఈ చైన్ ఎక్కడో ఒక చోట ఆగాలి. ఒకవేళ పరిణామక్రమాన్ని వాదన కోసం అంగీకరించినా, పరిణామక్రమంలోని ఏకకణ జీవి వరకు వెనక్కు ఈ చైన్ వెళ్ళినా ఎక్కడో ఒక చోట ఆగాలి. అది చివరకు విశ్వావిర్భావం వరకు వెళ్ళినా సరే అక్కడ ఆగక తప్పదు. ఎందుకంటే, ఎక్కడో ఒక చోట మొదలు లేకపోతే నేను ఇక్కడ ఉనికిలో ఉండడం తార్కికంగా అసాధ్యం. ఈ ఇన్ఫినిట్ రిగ్రెషన్ గురించిన వాదన పూర్తి స్థాయిలో ఈ చర్చలో రాలేదు. ముఫ్తీ తన వాదనలో మీరెక్కడ ఆగుతారో అక్కడే దేవుడుంటాడని, నెసెసరీ బీయింగ్, కంటింజెంట్ బీయింగ్ భావనను క్లుప్తంగా చెప్పారు. కాని సాధారణ ప్రేక్షకులకు కూడా అర్థమయ్యే సరళమైన భాషలో దీన్ని వివరించి ఉంటే బాగుండేది.

ఇన్ఫినిట్ రిగ్రెషన్ గురించిన చర్చలోనే చాలా విషయాలు దాగు న్నాయి. గణితశాస్త్రంలో కాన్సెప్ట్ పరంగా ఇన్ఫినిటీ ఉండవచ్చు. సంఖ్యలు ఇన్ఫినిట్. కాని ఆచరణాత్మక భౌతిక ప్రపంచంలో ఏదయినా పని, ఏదయినా ఉనికి ఉందంటే దానికి మొదలు ఉండడం తప్పనిసరి. దీన్నే మనం కార్యాకారణ సంబంధం అని చెప్పుకోవచ్చు. ఒక కారణం వల్ల ఒక పని జరిగింది, ఆ కారణం మరో కారణం వల్ల ... ఈ శృంఖల ఎక్కడో ఒక చోట ఆగితేనే అసలు పని లేదా ఉనికి సాధ్యపడుతుంది. అంటే ఎక్కడో ఒక చోటి నుంచి మొదలైతేనే ఇక్కడికి రావడం జరుగుతుంది. మొదలయ్యే ప్రతి పనికి తుది కూడా ఉంటుంది. ఆది, అంతం అనే పదాలు భౌతిక పరిమితులు. ఈ పదాలు మనిషికి, భౌతిక ప్రపంచానికి వర్తించే పదాలు. దేవుడి విషయంలో మాట్లాడుతున్నప్పుడు ఈ పదాలు అసంబద్ధమై పోతాయి. ఎందుకంటే ఆది, అంతం అనేవి ప్రక్రియలకు, పనులకు సంబంధించినవి. ఉదాహరణకు నేను ఒక వ్యాసం రాశాను. వ్యాసం రాయడం ప్రారంభించడం ఆది, ముగించడం తుది. పని చేసింది నేను. నేను చేసిన పని వివిధ దశలు మాత్రమే ఈ పదాలు చెబుతాయి, కాని నా గురించి కాదు. ఈ పదాలతో దేవుడి గురించి చర్చించడం సాధ్యం కాదు. కాబట్టి ఏ పనయినా ప్రారంభ కావడానికి ఒక కారణం ఉందనుకుంటే, ఆ కారణాల పరంపర ఎక్కడో ఒకచోట ఆగాలి. లేకపోతే ఆ పనే జరగదు. కాని పని జరిగింది. పూర్తి విశ్వం మన ముందు ఉంది. అంటే ఇన్ఫినిట్ రిగ్రెషన్‌లేదు. అంటే కార్యాకారణ సంబంధాలకు అతీత మైన శక్తి ఏదో ఈ పని ప్రారంభించిందనేది వాదనకు ముగింపు అవుతుంది. ఈ శక్తికి దేవుడని పేరు పెట్టండి లేకపోతే మరో పేరు పెట్టుకోండి.

బిగ్ బ్యాంగ్ థియరీ విషయంలో కూడా ఈ విశ్వం మొత్తం ప్రారంభమైన తీరును వర్ణిస్తుంది. కాని ప్రారంభంలో ఉన్న అత్యంత సాంద్రీకృత ద్రవ్యబిందువు ఎక్కడిది? అనే ప్రశ్నకు జవాబు లేదు. దానికి కారణం, కారకుడు ఒక అలౌకిక శక్తి అనుకోకతప్పదు. అప్పుడు ఆ అలౌకిక శక్తి నెసెసరి బీయింగ్ .... మిగిలిన సమస్త విశ్వం కంటింజెంట్ బీయింగ్.

ఇక్కడ మరో విషయం గుర్తించాలి. ఈ చర్చ ప్రారంభంలోనే మతాల గురించి చర్చ కాదు, దేవుడున్నాడా లేదా అనేది చర్చనీయాంశం అని స్పష్టం చేశారు. కాని జావేద్ అఖ్తర్ తన ప్రారంభవాదనలో ప్రపంచ చరిత్రలో వివిధ మతాల్లో దేవుళ్ళ గురించి చెబుతూ, ప్రారంభ చరిత్ర నాటి దేవుళ్ళు ఇప్పుడు లేరని చెప్పారు. మతాల చరిత్రలో అది నిజమే. కాని చర్చ మతాల గురించి కాదు. మానవచరిత్ర ప్రారంభ దశలో దేవుడిని ఏ పేరుతో పిలిచినా, ఏ విధంగా కొలిచినా తర్వాతి క్రమంలో వివిధ భాషల్లో, వివిధ సముదాయాల్లో దైవానికి ఏ పేరు పెట్టుకున్నా, దైవభావనలో ఎలాంటి మార్పులు వచ్చినా... అసలు ప్రశ్న దేవుడనే భావన ఉండేది. కాబట్టి అసలు చర్చ మతాల పరిణామ క్రమం కాదు, దేవుడున్నాడా అనేది అసలు చర్చ. కాని ప్రారంభ వాదనలోనే అసలు చర్చ నుంచి పక్కదారి పట్టించారు.

జావేద్ అఖ్తర్ వాదనలో ప్రస్తావించవలసిన మరో విషయం ఈ భౌతిక ప్రపంచంలో న్యాయం అనేది లేదని చెప్పడం. దానికి ఉదాహరణగా ఆయన పులి జింకను చంపడం, తుఫానులో జరిగే ప్రాణనష్టాలు చెబుతూ పులికి, తుఫానులకు శిక్షలు పడవని చమత్కారంగా మాట్లాడారు. ఇది చమత్కారంగా బాగుంటుంది కాని దీనికి వాస్తవాలతో సంబంధం లేదు. పులి ఆకలేస్తేనే జింకను చంపుతుంది. పులి జంతువులను చంపి తర్వాత తన పిల్లల కోసం, తన వంశంలోని తరతరాల కోసం మాంసం ఫ్రీజులో పెట్టుకుని పోగు చేయదు. పులికి దురాశ ఉండదు. కాని మనిషికి ఉంటుంది. పులికి సహజ ప్రవృత్తి మాత్రమే ఉంటుంది. ఆకలేస్తే దొరికిన జంతువును చంపితినడం. దానికి అంతే తెలుసు. కాని మనిషికి బుద్ధివివేకాలుంటాయి. తన దురాశతో దోపిడీకి పాల్పడతాడు. మనిషి చేసే పనుల వెనుక ఇంటెంట్ ఉంటుంది. అంటే ఉద్దేశ్యం. అది చెడు ఉద్దేశ్యం కావచ్చు. మంచి ఉద్దేశ్యం కావచ్చు. ఈ స్వేచ్ఛ మనిషికి ఉంది. అలాగే తుఫానులు భౌతిక ప్రకృతి మార్పులు. తుఫాను మనిషి రాజుగారా, పేదవాడా అనేది చూడదు. కాని రాజుగారు తన విలాసవంతమైన భవనంలో తుఫాను నుంచి తప్పించుకో గలడు. పేదవాడు తప్పించుకోలేడు. తుఫాను వల్ల జరిగే ప్రాణ నష్టం ప్రకృతి చేసే అన్యాయం అని చెప్పడంలోనే అవగాహనా

లోపం ఉంది. ప్రజలను పాలించే పాలకులు ప్రజలను ప్రకృతి విపత్తుల నుంచి కాపాడే బాధ్యత నుంచి తప్పించుకోడానికి చెప్పే యాక్ట్ ఆఫ్ గాడ్ వంటి సాకు ఇది. ప్రకృతిలో న్యాయం లేదని చెప్పడం ఒక విచిత్రమైన వాదన. ప్రకృతి కొన్ని భౌతిక సూత్రాల ప్రకారం పనిచేస్తుంది. ఈ భౌతిక సూత్రాలు మారవు. మనిషి తన బుద్ధి వివేకాలతో ఈ భౌతికసూత్రాలను తెలుసుకుని వాటికి అనుగుణంగా నడుచుకోవాలి. అందుకే మనిషికి బుద్ధి వివేకాలున్నాయి. వాటిని ఉపయోగించుకుని విజ్ఞానశాస్త్రం విస్తరించింది. తుఫానులు ఎప్పుడు వస్తాయో తెలుసుకునే జ్ఞానం లభించింది. ఆ జ్ఞానాన్ని ఉపయోగించుకుని రక్షణ పొందడం మనిషి, మానవ సముదాయాలు, మానవ సమాజాల పరిపాల కులు చేయవలసిన పని. కాని తుఫానుల్లో నష్టాన్ని చూపించి ప్రకృతిలో న్యాయం లేదు కాబట్టి న్యాయం అనేది సాధ్యం కాదన్నట్లు మాట్లాడడం విచిత్రమైన వాదన.

ప్రకృతిలో న్యాయం లేదన్నది నిజమే, కాని ప్రకృతి న్యాయం చేయడానికి కూర్చుని లేదు. ప్రకృతి న్యాయమూర్తి కాదు. తుఫాను తీసుకొచ్చి దుర్మార్గులను అంతం చేయడం ప్రకృతి పని కాదు. ప్రకృతి భౌతికసూత్రాల ప్రకారం పనిచేస్తుంది. కాని మనిషికి న్యాయం అవసరం. మనిషికి న్యాయం ఎవరి నుంచి అవసరం అంటే తోటి మనిషి నుంచి న్యాయం అవసరం. ప్రకృతి అన్యాయం చేస్తుంది కాబట్టి న్యాయం కావాలని ఎవరు అడగరు. దొంగ దోచుకుంటే, ఎవరైనా కామాంధుడు మహిళ మర్యాదను మంటగలిపితే బాధితులకు న్యాయం అవసరం. హత్యలకు ఎవరైనా పాల్పడితే న్యాయం అవసరం. న్యాయం మనిషికి మనిషి వల్ల జరిగే అన్యాయాల వల్ల అవసరమవుతుంది. మనిషి సహజంగా న్యాయాన్ని కోరుకుంటాడు. ఈ క్రమంలో ఏది న్యాయం అనేది ఎవరు నిర్ణయిస్తారనే ప్రశ్నపై కూడా చర్చలో ఆసక్తికరమైన వాదన చోటు చేసుకుంది. సమాజం నిర్ణయిస్తుం దని జావేద్ గారు చెప్పారు. అంటే మెజారిటీ ప్రజల నిర్ణయమా? అయితే నాజీ జర్మనీలో అప్పుడు మెజారిటీ ప్రజలు ఎన్నుకున్న వాడే కదా హిట్లర్ అనేమాటకు జావేద్ జవాబిస్తూ, అప్పుడు ప్రపంచంలో మెజారిటీ ప్రజలు హిట్లర్ ను వ్యతిరేకించా రని అన్నారు, దానికి జవాబుగా ముఫ్తీ అయితే ప్రపంచంలో మెజారిటీ ప్రజలు ఆస్తికులు కదా మీరు కూడా ఆస్తికుడిగా ఎందుకు మారడం లేదని ఎదురు ప్రశ్నించారు. మెజారిటే రియనిజం అనేది మంచిది కాదని ప్రత్యేకంగా ఇక్కడ చర్చించ వలసిన అవసరం లేదు. ఏది న్యాయం? ఏది అన్యాయం అనే విషయంలో ఖచ్చితమైన శాశ్వత నియమాలు ఎక్కడి నుంచి లభించాలనేది చర్చలో అంతగా ప్రస్తావనకు రాలేదు.

ఈ చర్చలో గాజాలో నరసంహారం కూడా ప్రస్తావనకు వచ్చింది. దేవుడుంటే, దేవుడు కరుణామయుడైతే గాజాలో జరుగుతున్న నరసంహారాన్ని, పసిపిల్లల హత్యలను ఎందుకు ఆపడం లేదు. ఎప్పుడో జరిగే న్యాయం కోసం ఎదురు చూడాలా అని జావేద్ గారు ప్రశ్నించారు. ఈ ప్రశ్న వినేవారికి చాలా సబబుగా అనిపించింది. నిజమే దేవుడు కరుణామయుడైతే ఈ దుర్మార్గాన్ని ఎందుకు ఆపడం లేదు? కాని దేవుడున్నాడా అనే చర్చలో ఇది ఎమోషనల్ టర్న్. ఇలాంటి వాదన ఎమోషనల్‌గా ప్రభావితం చేయడానికి ఉపయోగించే వాదన. ఆ విషయాన్ని ముఫ్తీ నిర్మొహ మాటంగా జావేద్ గారికి చెప్పేశారు.

ముఫ్తీ గారు దీనికి జవాబిస్తూ దేవుడు కరుణామయుడే కాదు అన్నీ తెలిసినవాడు, మహా వివేకవంతుడు అని వివరిస్తూ ప్రాబ్లమ్ ఆఫ్ ఈవిల్ గురించి చెప్పారు.

ఇక్కడ ఆలోచించవలసిన విషయాలు చాలా ఉన్నాయి. మొదటిది, ఆస్తికత్వం, నాస్తికత్వాల మధ్య చర్చలో దేవుడు లేడని చెప్పడానికి గాజా నరసంహారాన్ని నాస్తిక ప్రతినిధి ప్రస్తావిం చారు. కాగా గాజాలో జరుగుతున్న నరసంహారం స్వయంగా ఆస్తికులు చేస్తున్నదే. మతం కోసం జరుగుతున్నదే. ఇది నిజంగానే చాలా మందిని ఆలోచింపజేస్తుంది.

దేవుడు ఈ నరసంహారాన్ని ఎందుకు ఆపడం లేదు? అనేది ఆస్తికులపై సంధించిన ప్రశ్న అయితే, మానవత్వం, మానవ విలువలు పాటించవలసిన, జావేద్ గారు స్వయంగా చెప్పినట్లు మానవ సమాజాలు నిర్ణయించుకున్న మానవీయ విలువలు సూత్రాల ఆధారంగా, తోటి మనుషుల మీద జరుగుతున్నఈ దారుణాన్ని చూస్తూ కూడా ప్రపంచ ప్రజానీకం, ప్రపంచ దేశాలు ఎందుకు ఆపడం లేదు? ఈ ప్రశ్న కూడా అంతే కీలకమైనది. ఎందువల్ల ప్రపంచ దేశాలు ఈ నరసంహారాన్ని ఆపే ప్రయత్నాలు చేయడంలేదు. ప్రయత్నాల రూపంలో జరుగుతున్నది కుట్రలు కుతంత్రాలన్నది అందరికీ తెలిసిన విషయమే. న్యాయప్రియులు, మానవవాదులు కొందరు ఈ నరసంహారాన్ని ఆపడానికి ప్రయత్నిస్తున్నారన్నది నిస్సందేహంగా వాస్తవం. వారి ప్రయత్నాలు స్వాగతించదగ్గవి. కాని ప్రపంచదేశాలు, ప్రభుత్వాలు తలచు కుంటే ఈ నరసంహారాన్ని ఆపడం కష్టమా?

ఇక్కడే ప్రాబ్లమ్ ఆఫ్ ఈవిల్ అనే సమస్య తలెత్తుతుంది. మనిషికి దేవుడు భూప్రపంచంలో పూర్తి స్వేచ్ఛ ఇచ్చాడు. బతికినంత కాలం ఈ స్వేచ్ఛను ఉపయోగించుకుని తన ఇష్టానుసారం బతకవచ్చు. ఈ స్వేచ్ఛ మరణం తర్వాత అంతమవుతుందన్నది ఇస్లామీయ తాత్వికత. ఈ స్వేచ్ఛను వాడుకుని దుర్మార్గాలకు

పాల్పడిన వారికి తగిన శిక్ష మరణానంతరం తప్పదని, బాధితులకు పూర్తి న్యాయం జరుగుతుందని దివ్యఖుర్‌ఆన్ చెబుతుంది. అదే శాశ్వతన్యాయం. కాబట్టి దేవుడు ఈ ప్రపంచంలో మనిషి స్వేచ్ఛలో కల్పించుకుని అన్యాయాలు, దుర్మార్గాలు ఆపేస్తానని ఎక్కడా చెప్పలేదు. అలాగే ఆపకుండా వదిలేస్తానని కూడా చెప్పలేదు. ఇది ఆయన వివేకవివేచనాలపై ఆధారపడిన విషయం. ఈ వాస్తవాన్నే ముఫ్తి క్లుప్తంగా చెప్పడానికి ప్రయత్నించారు. దుర్మార్గాలు, హత్యాకాండలు ఇవన్నీ దేవుడు చేయడం లేదు, మనిషి చేస్తున్నాడు, దేవుడు ఇచ్చిన స్వేచ్ఛను దుర్వినియోగం చేసి ఈ పనులకు పాల్పడుతున్నాడు. అలాంటి వారిని ఇహలోకంలోనే స్వయంగా కల్పించుకుని శిక్షించాలా? లేక పరలోకంలో శిక్షించాలా అన్నది దేవుని వివేకవివేచనలపై ఆధారపడిన నిర్ణయం కాని, మనిషి చేస్తున్న దుర్మార్గాలను తోటి మనుషులు చూస్తున్నారు, చూసి భరిస్తున్నారు, తలచుకుంటే ఆపే శక్తి ఉన్న దేశాధినేతలు కూడా తమాషా చూస్తున్నారు. ఇది మానవత్వానికి మచ్చ. మనుషులు మనుషులుగా వ్యవహరించకుండా అమానుషంగా వ్యవహరిస్తున్న సంఘటనల్లో ఈ పరీక్ష ఎంతమందికి ఎన్ని విధాలుగా ఎదురవుతుంది? మౌనంగా ఉన్నవారికి కూడా ఇది పరీక్షే.

చెడును చూస్తే చేత్తో ఆపడానికి ప్రయత్నించండి, సాధ్యం కాకపోతే నోటితో ఆపడానికి ప్రయత్నించండి, అది కూడా సాధ్యం కాకపోతే కనీసం చెడును చెడుగా మనసులో భావించండి అనే బోధన ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలి. ముఫ్తీ గారు ఈ చర్చలో ఈ వివరాలు చర్చనీయాంశం పరిమితుల దృష్ట్యా ప్రస్తావించలేదు. చర్చలో ఏ మతాన్ని ప్రస్తావించకుండా ఆయన కేవలం చర్చనీయాంశానికే పరిమితమయ్యారు. కాని వాస్తవమేమిటంటే, గాజాలో నరసంహారం కాని, ప్రపంచంలో జరిగే హత్యలుకాని, మూకదాడులు కాని, నేరాలు కాని ఏవైనా సరే మానవసమాజాల్లో జరుగుతున్నాయి. తోటి మనుషులపై జరుగుతున్న దాడులను మనుషులుగా చూసి భరించడం జరుగుతోంది. దేవుడు ఈ దుర్మార్గాలను ఎందుకు ఆపడం లేదని ప్రశ్నిస్తున్నవారు, మనుషులు ఈ దుర్మార్గాలను సామాజికంగా, ప్రభుత్వాల పరంగా, సాముదాయికంగా ఆపడానికి ఎందుకు ప్రయత్నించడం లేదు? మానవ విలువలు ఏమయ్యాయనే ప్రశ్న ఎందుకు వేయడం లేదు.

ఈ చర్చలో ప్రస్తావనకు వచ్చిన మరో ఆసక్తికరమైన విషయం విశ్వాన్ని సృష్టించే ముందు దేవుడు ఏం చేస్తున్నాడు అనే ప్రశ్న కాస్త వ్యంగ్యంగా వచ్చింది. దీనికి ముఫ్తీ చక్కని జవాబు చెప్పారు. ముందు, వెనుక, ఇప్పుడు, లేదా గతం, వర్తమానం, భవిష్యత్తు.... ఇవి కాలానికి సంబంధించిన ప్రశ్నలు. కాలం అనేది విశ్వావిర్భావం తర్వాత పుట్టింది. విశ్వావిర్భావానికి ముందు కాలం లేదు. కాలమే లేనప్పుడు అంతకన్నా ముందు అనే ప్రశ్న ఉండదు. ఎందుకంటే కాలమే లేనప్పుడు ముందు వెనుకలనే పదాలు అర్థరహితాలు. ఎందుకంటే ఈ పదాలు కేవలం మనుషులకు, భౌతిక ప్రకృతికి మాత్రమే వర్తించే పదాలు. కాబట్టి విశ్వాన్ని సృష్టించిన దేవుడే కాలాన్ని సృష్టించాడు. కాలాన్ని సృష్టించడానికి "ముందు" అనే ప్రశ్నలోనే పొరబాటు ఉంది. "ముందు" అనే పదమే అక్కడ వర్తించదు. నిజానికి ఇది లోతయిన తాత్విక వాదన. శివుడాజ్ఞ లేనిదే చీమైనా కుట్టదనే సామెత గుర్తుందా. ఈ సామెతలో ఈ లోతయిన తాత్వికత ఉంది. చీమ కుట్టాలని దేవుడు ఆదేశిస్తే చీమ కుడుతుందని ఈ సామెతకు అర్థం కాదు. చీమ ఫలానా వాడికి కుడుతుందనే విషయం దేవుడికి ముందుగానే తెలుసు. ఎందుకంటే కాలం ఆయనకు వర్తించదు. స్టిల్ ఫోటోగ్రాఫ్ మాదిరిగా కాలం ఆయన చేతిలో ఉంది. భూత భవిష్యత్ వర్తమానాలన్నీ ఆయన జ్ఞానంలో ఉన్నాయి. కాబట్టి ఎవరికి ఎప్పుడు ఏమవుతుందో, ఎవరు ఎప్పుడు ఏం చేస్తారో ఆయనకు తెలుసు. ఎప్పుడు, ఎక్కడ, ఆది, తుది, గతం, భవిష్యత్తు ఈ పదాలన్నీ స్థలకాలాలకు సంబంధించిన పదాలు. ఈ పదాలను దేవుడి ఉనికికి వర్తింపజేయలేము. విశ్వాన్ని సృష్టించడానికి ముందు దేవుడు ఏం చేసేవాడనే ప్రశ్న జావేద్ గారు నవ్వుకోడానికి వ్యంగ్యాత్మకంగా బాగుందనిపించవచ్చు. కాని తాత్వికంగా ఇది అసంబద్ధమైన ప్రశ్న. ఇదే విషయాన్ని ముఫ్తీ గారు చెప్పారు.

చివరిగా ఈ చర్చకు సంబంధం లేని విషయం.

హార్వర్డ్ యూనివర్సిటీ ఖగోళ, భౌతిక శాస్త్రవేత్త డాక్టర్ విల్లీ సూన్ ఆసక్తికర వాదన తెర మీదకు తీసుకొచ్చారు. దేవుడి ఉనికిని గణిత సూత్రం నిరూపిస్తుందని సూన్ అంటున్నారు. జీవం పుట్టుకకు కచ్చితమైన.. నిర్దిష్టమైన పరిస్థితులు అనుకూలించిన విధానాన్ని చూస్తే.. అవేవో యాక్సిడెంటల్‌గా జరిగినవిగా కనిపించవన్నది ఆయన మాట.

ప్రపంచాన్ని దేవుడే నడిపిస్తున్నాడా లేదా అన్న సంగతి పక్కన పెడితే.. ఏదో శక్తి మాత్రం కచ్చితంగా ఈ ప్రపంచం వెనక ఉంది అన్నది చాలామంది అభిప్రాయం. ఐతే సూన్ కూడా ఇప్పుడు అలాంటి చర్చే తీసుకువచ్చారు. మతానికి సైన్స్ విరుద్ధంగా కనిపిస్తుంటుంది. ఐతే గణిత సూత్రం.. దేవుడి ఉనికిని నిరూపించగలదని హార్వర్డ్ శాస్త్రవేత్తలు చెప్పడం ఇప్పుడు ప్రపంచాన్ని ఆశ్చర్యంలో పడేస్తోంది. ✤

# కాలం సాక్షిగా జీవితం...

యండి. ఉస్మాన్ ఖాన్, సీనియర్ జర్నలిస్ట్



**కాలం గిర్రున తిరిగింది.** చూస్తుండగానే మరో యేడాది కాల గర్భంలో కలిసిపోయింది. ఎన్నో ఆశలు, ఆశయాలు, బాసలతో గత నూతన సంవత్సరంలోకి ప్రవేశించినవారు తమ ఆశలను, ఆశయాలను ఏ మేరకు సాకారం చేసుకున్నారోగాని, కాలమైతే తనకేమీ సంబంధమే లేనట్లు అప్రతిహతంగా సాగిపోయింది. ఎందుకంటే అదే దాని కర్తవ్యం. ఎవరికోసమూ అది ఆగదు. పరుగే దాని నైజం. నిరంతరం అది పరుగెడుతూనే ఉంటుంది. దానివెనుక పరుగెత్తలేని వారు మరుగున పడిపోతారు. అనంతమైన ఈ కాల ప్రవాహాన్ని దైవం మనకోసం సులభతరం చేశాడు. కనుకనే క్షణాలు, నిమిషాలు, గంటలు, ఘడియలు, విఘడియలు, ఝాములు అని మనం కాలాన్ని మన సౌకర్యం కోసం రకరకాలుగా విభజించుకున్నాం. ప్రకృతి పరంగా కూడా, సూర్యోదయం, సూర్యాస్తమయం, చంద్రో దయం, అమావాస్య, పౌర్ణమి, పగలు, రాత్రి, రోజు, వారం, నెల, సంవత్సరం అనే విభజన ఉంది. ఈ ప్రకృతి నియమాన్నే మానవులు అనాదిగా అనుసరిస్తూ వస్తున్నారు. కాలగతిలో కేలండర్లు మారుతుంటాయి. కొత్తవత్సరాలు వస్తూ ఉంటాయి. వివిధ దేశాల్లో, వివిధ మతాల్లో రకరకాల పేర్లతో ఇవి ప్రాచుర్యం పొందాయి.

'ఉగాది' తో కొత్త సంవత్సరం ప్రారంభమైనట్లుగానే, ఇస్లాంలో 'ముహర్రం' నెలతో నూతన సంవత్సరం ప్రారంభమవుతుంది. అలాగే క్రీ. శ. జనవరితో ఆంగ్ల సంవత్సరం ఆరంభమవుతుంది. కొత్త సంవత్సరంలోకి అడుగు పెడుతున్నప్పుడల్లా, మనకు ఓ విధమైన నూతనత్వపు అనుభూతి కలుగుతుంది. అనునిత్యం మార్పుచెందే ఈ కాల ప్రవాహంలో సంవత్సరాలు మారడం అనేది పెద్ద విశేషమేమీ కాదు. ఈ మార్పు ఒక చిన్న బిందువు లాంటిది. ఆ బిందువే మార్పుకు శ్రీకారం చుడుతుంది. ఇది నిరాటంకంగా, ప్రతినిత్యం జరిగే సహజ ప్రక్రియ. కాలం ఎంత వేగంగా గడిచిపోతుందో తెలుసుకోవాలంటే, కాసేపు గడియారపు సెకన్ల ముల్లు కదలికను గమనిస్తే అర్థమవుతుంది. నిజానికి ఒక్క సెకను కాలం కూడా చాలా విలువైనదే. ఈ ఒక్క సెకనులో వెలుగు లక్షా ఎనభై ఆరువేల మైళ్ళ దూరం ప్రయాణం చేస్తుంది. ఇది మనకు తెలిసిన లెక్క. దేవుని ఈ సృష్టిలో ఇంత కన్నా వేగంగా పయనించగల అనేక వస్తువులు కూడా ఉండవచ్చు. అవి ఇంకా మన జ్ఞాన పరిధిలోకి రాలేదేమో.!

మనం గోడకు నూతన సంవత్సర క్యాలెండరును వేలాడదీసే ముందుగా, ఎన్నో విషయాలు, గణాంకాలు మారిపోయిన సంగతి మనకు బోధపడుతుంది. అందుకే ఈ నూతన సంవత్సరంలోకి అడుగుపెట్టే ముందు, మనం గతాన్ని నెమరువేసుకొని

జాగృతం కావాలి. భవిష్యత్ కలలను సాకారం చేసుకునే దిశగా అడుగులు ముందుకు వేయాలి. ఈ క్రమంలో గడిచిన కాలాన్ని మరింత దగ్గరగా, నిశితంగా పరిశీలించడం వల్ల ఇక ముందు మనం ఏం చేయాలో, ఏం చేయకూడదో ఒక స్పష్టత వస్తుంది. మారుతున్న కాలంలో మన జీవితాలు సరైన పంథాలో పయనించడానికి తోడ్పడుతుంది. జీవితంలో సంభవించిన ఆసక్తికరమైన అంశాలతో పాటు, మనపై ప్రభావం చూపిన అంశాలను కూడా ఈ సందర్భంగా పరిగణనలోకి తీసుకోవాలి. వాటిని అవలోకనం చేసుకోవాలి. గత కాలానికి వీడ్కోలు పలికి కొత్తవత్సరానికి స్వాగతం పలికే సమయంలో ఎవరైనా ఆనందానుభూతులకు లోనుకావడం సహజం. సంతోషం అనేది మానవ నైజంలో ఉన్న సహజ గుణం. అయితే, ఆనంద పారవశ్యంలో హద్దుల్ని అతిక్రమించి, నిషిద్ధకార్యాలకు పాల్పడడం ధార్మికంగానే కాకుండా, సామాజిక పరంగా, నైతిక పరంగా కూడా తగదు. అదినేరమవుతుంది. దీనికి దేవుని దగ్గర సమాధానం చెప్పుకోవలసి ఉంటుంది. అందుకే కాలాన్ని సాక్షిగా పెట్టి దేవుడు అనేక యదార్థాలు చెప్పాడు. ఒక్కసారి మనం వెనక్కి తిరిగి చూస్తే, కాలం చెప్పిన అనేక వాస్తవాలు కళ్ళకు కడతాయి.

కాలం గురించి ఇస్లాం చేసిన బోధనలు మనకు మరిన్ని జాగ్రత్తలు నేర్పుతాయి. ఖురాన్ లో దైవం కాలంపై ప్రమాణం చేస్తూ 'వల్ అస్ర్' అని చెప్పడం యాదృచ్ఛికం కాదు. మానవుడు నష్టంలో ఉన్నాడని చెప్పడంలో కాలం వృథా కావడమే ప్రధాన కారణమని పండితులు వ్యాఖ్యానించారు. అంటే కాలాన్ని ఆదరించకుండా నిర్లక్ష్యం చేస్తే అది మనకు శత్రువుగా మారుతుంది. గడిచిపోయిన ప్రతి రోజు మన జీవితంలో తిరిగి రాని ఒక అవకాశం. దానిని ఎలా వినియోగించుకున్నామన్నదే మన విలువను నిర్ణయిస్తుంది. అందుకే కాలాన్ని తేలికగా తీసుకునే అలవాటు, తెలియకుండానే మన భవిష్యత్తును మన చేతులతోనే నాశనం చేసుకునే పరిస్థితికి తీసుకువెళుతుంది.

ముహమ్మద్ ప్రవక్త (స) కూడా కాలాన్ని గురించి, జీవితాన్ని గురించి స్పష్టమైన హెచ్చరిక చేశారు. 'ఐదు విషయాలకు ముందు ఐదు విషయాలను సద్వినియోగం చేసుకోండి. వృద్ధాప్యం రాకముందు యౌవనాన్ని, అనారోగ్యం రాకముందు ఆరోగ్యాన్ని, పేదరికం రాకముందు సంపదను, పనుల్లో మునిగి పోకముందు ఖాళీ సమయాన్ని, మరణం రాకముందు జీవితాన్ని' అని ఆయన ఉపదేశించారు. ఈ హదీసు నూతన సంవత్సర ఆరంభానికి సరైన దిశా నిర్దేశం చేస్తుంది. ఎందుకంటే కొత్త సంవత్సరం మనకు కొత్త జీవితాన్ని ఇవ్వదు, ఉన్న జీవితాన్ని సరిదిద్దుకునే ఒక అవకాశం మాత్రమే ఇస్తుంది. ఆ అవకాశాన్ని మనం ఎలా వినియోగించుకుంటామన్నదే, మన నూతన సంవత్సరం నిజంగా నూతనంగా మారుతుందా, లేక వృధా అయిపోతుందా అన్న విషయాన్ని నిర్ణయిస్తుంది.


కాలం విలువను గుర్తించిన వారు మాత్రమే వాటినుండి గుణపాఠం నేర్చుకోగలుగుతారు. అలా కాకుండా కాలాన్ని గాలి కొదిలేసి, కొత్తసంవత్సరంలో చైతన్య రహిత చర్యలతో, అర్థం పర్థం లేని కార్యకలాపాలతో కొత్తకాలాన్ని ప్రారంభిస్తే ప్రయోజనం శూన్యం. కాలం ఎవరి కోసమూ ఆగదు. రాజులు రారాజులు, మాన్యులు, సామాన్యులు, పండితులు, పామరులు అంతా కాలగర్భంలో కలిసిపోయినవారే, కలిసిపోవలసినవారే. కొత్తసంవత్సరానికి స్వాగతం పలికేటప్పుడు ఈ వాస్తవాన్ని గుర్తుంచుకోవాలి. గతం నుండి గుణపాఠం గ్రహిస్తూ భవిష్యత్తు కాలానికి స్వాగతం పలకాలి.

నిస్సందేహంగా కొత్తసంవత్సరాన్ని సంతోషంగా స్వాగతించాల్సిందే. కాని ఆ సంతోషంలో హద్దుల అతిక్రమణ జరగకుండా చూసుకోవాలి. మందు, చిందు ఇతరత్రా అసభ్య, నిషిద్ధ కార్యాలతో నూతన సంవత్సరాన్ని ఆహ్వానించడం ఎంతవరకు సమంజసం అన్న స్పృహ జాగృతం కావాలి. కాలం చెప్పే చారిత్రక వాస్తవాల నుండి గుణపాఠం గ్రహించకుండా లక్ష్య రహితంగా భవిష్యత్తును ప్రారంభిస్తే మిగిలేది నిరాశే. అందుకని గడచిన కాలంలో ఏం చేశామన్నది కొత్త సంవత్సరం ప్రారంభాన ఆత్మ పరిశీలన చేసుకోవాలి. మంచి పనులు చేసి ఉంటే ఈ కొత్త సంవత్సరంలో వాటిని మరింతగా విస్తృత పరుచుకునే ప్రయత్నం చెయ్యాలి. ఏమైనా తప్పులు, పొరపాట్లు, పాపాలు జరిగి ఉంటే చిత్తశుద్ధితో పశ్చాత్తాపం చెందుతూ, ఇక ముందు అలాంటి వాటన్నిటినీ ఖచ్చితంగా విసర్జిస్తామని ప్రతినబూనాలి. ఇక నుండి ఓనూతన శకానికి నాంది అన్న ఆత్మ విశ్వాసం తొణికిస లాడాలి. గత పాపాల పట్ల సిగ్గుపడి, పశ్చాత్తాపం చెంది, భవిష్య త్తులో ఇక వాటి జోలికి పోమని ప్రతిన బూనిన వారిని దేవుడు ప్రేమిస్తాడు. కరుణిస్తాడు. వారి పాపాలను క్షమిస్తాడు. వారి ఇహపర సాఫల్యానికి మార్గం సుగమం చేస్తాడు.

జీవితం చాలా చిన్నది. ఎవరి జీవితం ఎప్పుడు సమాప్తమో ఎవరికీ తెలియదు. కనుక ఆనంద సమయమని హద్దుల్ని అతిక్రమించకుండా విలువలతో కూడిన జీవితం గడపడానికి శాయశక్తులా ప్రయత్నించాలి. సమాజ హితం కోసం సమయాన్ని వెచ్చించాలి. కాలాన్ని వినియోగం చేసుకోవడంపైన్నే సాఫల్య వైఫల్యాలు ఆధారపడి ఉన్నాయన్న వాస్తవాన్ని గ్రహించాలి. ✤

# జ్ఞాన జ్యోతులు వెలిగించిన విద్యాబాంధవి

(జనవరి 9 ఫాతిమా షేక్ జయంతి)




మదీహా అర్జుమంద్ ఖాన్

**ప్రాచీన కాలంలో** విద్య సామాన్యులకు అందని ద్రాక్షగా ఉండేది. కేవలం అగ్రకులాల వాళ్ళు మాత్రమే విద్యాభ్యాసం చేయడానికి అర్హులుగా పరిగణించబడేవారు. మిగతా వారెవరూ చదువుకు అర్హులు కారు. శూద్రులు, దళితులు, మహిళలు విద్య నేర్చుకోవడం నేరం, పాపం. సనాతన మతసాంప్రదాయంలో శూద్రులెవరైనా వేదం విన్నా, ఉచ్చరించినా కఠిన శిక్షలు విధించేవారట. అలాంటి అజ్ఞాన కాలంలో విద్యావ్యాప్తి కోసం అనేకమంది సంస్కర్తలు కృషిచేశారు. విద్యను సర్వసామాన్యం చెయ్యడానికి అలుపెరుగని ప్రయత్నం చేశారు. అగ్రవర్ణ సమాజం నుండి ఎన్ని అవమానాలు, ఎన్ని బెదిరింపులు, ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా మొక్కవోని ధైర్యంతో సమాజ సంస్కరణ కోసం పాటు పడ్డారు. అలాంటి వారిలో ఫాతిమా షేక్ ఒకరు. ఈమె సావిత్రీబాయి స్నేహితురాలు, సహోద్యోగి. భర్త సహకారంతో సావిత్రీబాయి, సోదరుని సహకారంతో ఫాతిమా విద్యార్జన చేశారు. సావిత్రి బాయితో కలిసి జ్యోతీరావు పూలే దగ్గరే ఆమె చదువు నేర్చుకున్నారు. సోదరుడు ఉస్మాన్ షేక్ ప్రోత్సాహంతో ఉన్నత చదువులూ అభ్యసించారు. సోదరుని సహకారంతోనే విద్యావ్యాప్తికి ఎనలేని కృషి చేశారు. పూలే దంపతులు గృహ బహిష్కరణకు గురైనప్పుడు వారికి ఆశ్రయం కల్పించి ఆదుకున్నారు. తమ హవేలీనే పాఠశాల నిర్వహణకోసం పూలే దంపతులకు వితరణగా ఇచ్చి అండగా నిలిచారు. సావిత్రీబాయి పూలేతో కలిసి ఉపాధ్యాయురాలిగా విద్యావ్యాప్తిలో కీలక పాత్ర పోషించారు. 1851లో ఆమె స్వయంగా ముంబైలో రెండు పాఠశాలలు స్థాపించారు. దళితుల ఇళ్ళకు వెళ్ళి పిల్లల చదువు విషయంలో వారిని చైతన్య పరిచారు. గంటలు గంటలు సమయం వెచ్చించి వారికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలకు విద్య ఆవశ్యకతను వివరించి వారిలో జ్ఞాన జ్యోతులు వెలిగించారు. ఆరోజుల్లో సనాతన మనువాదులు మహిళా విద్యను నిర్ద్వందంగా వ్యతిరేకించేవారు. రకరకాలుగా వేధించేవారు. అవమానాలకు, ఛీత్కరింపులకు గురిచేసేవారు. బెదిరింపులకు పాల్పడేవారు. అయినా ఆమె ఏమాత్రం లక్ష్యపెట్టలేదు, లెక్క చేయలేదు. దుమ్మెత్తి పోసినా, పేడ నీళ్ళు కుమ్మరించినా, రాళ్ళు విసిరినా చలించలేదు. ఈనాడు హరిజన, గిరిజన, మైనారిటీ, బడుగు బలహీన వర్గాల ప్రజలంతా విద్యాపరంగా ముందడుగు వేస్తున్నారంటే, అది ఫాతిమా షేక్, ఉస్మాన్ షేక్, సావిత్రిబాయి, జ్యోతిరావు పూలేల వంటి సంస్కర్తల పుణ్యమే అని గ్రహించాలి. సోదరుడు ఉస్మాన్ షేక్ సహకారంతో సావిత్రిపూలే, జ్యోతిబా పూలే లతో కలసి ఫాతిమా విద్యావ్యాప్తితో పాటు, అనేక సేవా కార్యకలాపాల్లో పాల్గొన్నారు. ఫాతిమా షేక్ గురించి సావిత్రీబాయి పూలే ఇలా రాశారు:' ఫాతిమా

నాకు ఎంతగానో సహకరించారు. ఆమె సహకారంతోనే నేను అనేక సేవా కార్యక్రమాలను కొనసాగించగలిగాను' అంటూ ఆమె తన భర్త జ్యోతిబా పూలేకు రాసిన లేఖలలో పేర్కొన్నారు. ఫాతిమా షేక్ సేవా కార్యక్రమాలపై దృష్టి పెట్టినంతగా సాహిత్యంపై పెట్టలేదు. లేకపోతే ఆమె గొప్పసాహిత్యాన్ని సృజించి ఉండేవారని, ఆమెకు సంబంధించిన సమాచారం లభించడంలో అది ఎంతగానో ఉపయోగ పడేదని ప్రముఖ చరిత్ర కారులు సయ్యద్ నశీర్ అహమ్మద్ అభిప్రాయ పడుతున్నారు. 2014లో మహారాష్ట్ర ప్రభుత్వం సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్, జాకీర్ హుస్సేన్, అబుల్ కలాం ఆజాద్ లాంటి వారితో పాటు ఫాతిమా షేక్ సంక్షిప్త పరిచయాన్ని 'బాల్ భారతి'లో పాఠ్యాంశంగా చేర్చింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఫాతిమా షేక్ సేవలను గుర్తించి, 8వ తరగతి పాఠ్యపుస్తకాలలో ఆమె రచనలపై పాఠాన్ని ప్రవేశపెట్టింది. ఆమె కేవలం ముస్లిం సమాజం కోసమే పని చేయలేదు, సమాజంలో వివక్షకు, అన్యాయానికి, అణచివేతకు, అవిద్యకు గురైన అన్ని వర్గాల ప్రజల కోసమూ ఆమె పాటు పడ్డారు. అగ్రకులాధిపత్యంలో తీవ్ర వివక్షకు గురైన వితంతువుల్లో చైతన్యం తీసుకురావడానికీ ఆమె శక్తివంచనలేని ప్రయత్నం చేశారు. ఎలాంటి అసమానతలూ లేని సమ సమాజాన్ని ఆమె కాంక్షించారు. దేవుని దృష్టిలో అందరూ సమానమే అయినప్పుడు మానవుల మధ్యనే ఈ వివక్ష ఎందుకన్నది ఆమె ప్రశ్న. ఇంతటి స్ఫూర్తి ప్రదాత అయిన ఫాతిమా షేక్‌కు సంబంధించిన పూర్తి వివరాలు, ఆమె చేపట్టిన సేవా కార్యక్రమాలు, విద్యావ్యాప్తికోసం ఆమె చేసిన అసామాన్య కృషిని చరిత్రకారులు మరింతగా వెలికి తీసి, వెలుగులోకి తీసుకు రావాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే, షుమారు 195 సంవత్సరాల క్రితంనాటి అజ్ఞాన సమాజంలో, నాటి ప్రతిబంధకాలన్నిటినీ ఛేదించుకొని సమాజ సంస్కరణకోసం నడుం బిగించడం, లక్ష్యాన్ని ముద్దాడడం సామాన్య విషయం కాదు. ఈ కారణంగానే ఆమె 191 వ జయంతి సందర్భంగా గూగుల్ సంస్థ తన హోమ్ పేజీలో డూడుల్ తో సత్కరించింది. కనుక సావిత్రిబాయి పూలేతో పాటు, ఫాతిమా షేక్‌నూ స్మరించుకోవలసిన అవసరం ఉంది. విపత్కర పరిస్థితుల్లో పూలే దంపతులకు ఆశ్రయం కల్పించి, తమ హవేలీని పాఠశాల నిర్వహణ కోసం వితరణగా ఇచ్చి, వారితో భుజం భుజం కలిపి పనిచేసిన ఫాతిమా షేక్ కృషినీ గుర్తించి, సావిత్రిబాయితో సమానంగా గౌరవిస్తూ, పీడిత, తాడిత అణగారిన వర్గాల అభ్యున్నతికోసం ఆమె చేసిన త్యాగాలను స్మరించుకోవలసిన అవసరం ఉంది. ఫాతిమా, సావిత్రి స్ఫూర్తితో బహుజనులంతా కలిసి హక్కుల కోసం సమిష్టి పోరాటాలు చేయవలసిన అవసరమూ ఉంది.


## చందాదారులకు విజ్ఞప్తి

చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.

**వివరాలకు సర్క్యులేషన్ మేనేజర్‌కు ఫోన్ చేయండి: 9704317015**

ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపినవారు ఈ నెంబరుకు **Screen Shot** పంపి **9989903850** ఫోన్ చేయండి.

## Bank Details

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
**Hyderabad- 500 002, Telangana**

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**

# మతం పేరుతో మారణహోమం దేవుని పేరుతో రాజకీయం

హిబా అర్జుమంద్ ఖాన్

**కాలం ఎంత ఆధునికమవుతున్నా, మనిషి మనసులోని మృగత్వం మాత్రం తగ్గడం లేదు. ఇటీవల బంగ్లాదేశ్‌లో ఒక వ్యక్తిని దారుణంగా హత్య చేసి, చెట్టుకు వేలాడదీసి నిప్పంటించిన సంఘటన మనమందరం చూశాం. ఆ హింస జరుగుతున్నవేళ కొందరు ముష్కరులు 'అల్లాహు అక్బర్' అంటూ నినాదాలు చేయడం మరింత కలచివేసింది.**




మన దేశంలో కూడా 'జై శ్రీరామ్' అంటూ నినదిస్తూ, రాముని పేరుతో జరుపుతున్న హత్యలు, మూక దాడులు, మారణ హోమాలు కూడా ఏ మాత్రం తక్కువకాదు. ఈ రెండు ఘటనలు/ దృశ్యాల మధ్య ఏమైనా తేడా ఉందా? లేదు. అక్కడా దేవుని పేరుతో దుర్మార్గమే, ఇక్కడా దేవుని పేరుతో దుర్మార్గమే. అసలు దైవ నామం హత్యలకు అనుమతి ఇస్తుందా? ఏ మతం అయినా హింసను ధర్మంగా బోధిస్తుందా? అన్న ప్రశ్నలు సహజంగానే ఉద్భవిస్తాయి.

నిజం ఏమిటంటే, మతం ఎప్పుడూ హింసకు మూలం కాదు. హింసకు మూలం మనిషిలోని ద్వేషం, అసహనం, అధికార కాంక్ష. మతం ఆ ద్వేషానికి ఒక ముసుగు మాత్రమే. దేవుడి పేరు చెప్పుకొని మనిషిని చంపడం ద్వారా ఎవడూ భక్తుడవ్వడు. నోట్లో నినాదం, చేతిలో ఆయుధం ఉంటే అది ధర్మం కాదు, అది మానవత్వానికి విరుద్ధమైన నేరం.

ఇస్లాం విషయానికి వస్తే, అత్యల్ప ప్రాణి అయిన చీమను కూడా అనవసరంగా చంపే అనుమతి లేదని ఇస్లాం స్పష్టంగా చెబుతుంది. ఖురాన్ మానవ ప్రాణాన్ని అత్యున్నత విలువగా గుర్తిస్తుంది. 'ఒక నిర్దోషిని చంపడం మొత్తం మానవజాతిని చంపినట్లే' అన్న భావన ఇస్లామీయ ధర్మబోధనల కేంద్ర బిందువు.

అదే విధంగా, రాముని పేరుతో మూక దాడులకు పాల్పడడం శ్రీరామ చంద్రునికే అత్యంత ఘోరమైన అవమానం.

ఇక్కడ స్పష్టంగా అర్థం చేసుకోవలసిన విషయం ఏమిటంటే, 'అల్లాహు అక్బర్' అంటూ హింసకు పాల్పడినా, 'జైశ్రీరామ్' అంటూ హింసకు తెగబడినా దానికి కారణం మతం కాదు, మతాన్ని వక్రీకరించి, దాన్ని తమ స్వార్థానికి వాడుకునే మనుషులే కారణం. దేవుడి పేరు పలకడం వల్ల హంతకుడు భక్తుడైపోడు. మతం మనిషిని సంస్కరించాలి గానీ, అతడిని మృగంగా మార్చకూడదు.

ఈ సంఘటనను కొంతమంది దుర్మార్గులు సోషల్ మీడియా వేదికగా మతాలమధ్య, కులాల మధ్య చిచ్చు పెట్టే ఆయుధంగా మార్చే ప్రయత్నం చేస్తున్నారు. ఒక దేశంలో జరిగిన నేరాన్ని, మరో దేశంలో ప్రతీకారానికి పిలుపుగా మార్చడం అత్యంత ప్రమాదకరమైన ధోరణి. ఇది బాధితుల పట్ల సానుభూతి కాదు, విద్వేషాన్ని వ్యాప్తి చేసే మానసిక - రాజకీయ దౌర్బల్యం, దుష్ప్రచారం మాత్రమే.

ఇక్కడ మరో అంశాన్ని కూడా విస్మరించలేం, బంగ్లాదేశ్‌లో జరిగిన ఈ ఘటన కేవలం మతపరమైనదేనా? లేక దాని వెనుక ఏమైనా రాజకీయ ప్రయోజనాలున్నాయా? అన్న ప్రశ్న కూడా తలెత్తుతోంది. చాలా దేశాల్లో పాలక రాజకీయ శక్తులు తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు, ప్రజల దృష్టిని మళ్లించేందుకు 'మైనారిటీల బూచి' ని చూపిస్తుంటాయి. మెజారిటీ సమాజంలో భయాన్ని రెచ్చగొట్టి, ఓటుబ్యాంకును పదిలం చేసుకోవడం అనేది పాత రాజకీయ తంత్రం. మత ఉద్రిక్తతలు పెరిగిన ప్రతీసారి, దాని లాభం సాధారణంగా అధికారంలో ఉన్నవారికే దక్కుతుందిబీ నష్టపోయేది మాత్రం సామాన్య ప్రజలే.

అందుకే బంగ్లాదేశ్ ఘటన అయినా, భారత్‌లో జరిగే సంఘటనలైనా, వాటిని కేవలం 'మతాల మధ్య ఘర్షణ'గా చూడటం

**ఈ సంఘటనను కొంతమంది దుర్మార్గులు సోషల్ మీడియా వేదికగా మతాలమధ్య, కులాల మధ్య చిచ్చు పెట్టే ఆయుధంగా మార్చే ప్రయత్నం చేస్తున్నారు. ఒక దేశంలో జరిగిన నేరాన్ని, మరో దేశంలో ప్రతీకారానికి పిలుపుగా మార్చడం అత్యంత ప్రమాదకరమైన ధోరణి. ఇది బాధితుల పట్ల సానుభూతి కాదు, విద్వేషాన్ని వ్యాప్తి చేసే మానసిక - రాజకీయ దౌర్బల్యం, దుష్ప్రచారం మాత్రమే.**

సరైన విధానంకాదు. మతం పేరుతో జరిగే ప్రతి హింస వెనుక మానవ ద్వేషంతో పాటు, చాలా సందర్భాల్లో రాజకీయ లెక్కలు కూడా పనిచేస్తాయి. ఈ నిజాన్ని గుర్తించకుండా ఒక మతాన్ని మొత్తం దోషిగా చిత్రీకరిస్తే, అది హింసోన్మాదుల వ్యూహానికి మనం సహకరించినట్లే అవుతుంది.

ఇస్లాం అయినా, హిందూ ధర్మం అయినా, క్రైస్తవ మతం అయినా – అన్నీ మానవీయ విలువలనే బోధిస్తాయి. కరుణ, క్షమ, న్యాయం, సహనం అన్నవే మతాల సారాంశం. వాటిని వదిలేసి ద్వేషాన్నే మతంగా మార్చుకుంటే, ఆ సమాజం శాంతిని కోల్పోతుంది. చివరికి మతం కాదు, మనిషే కనుమరుగవుతాడు.

అందుకే ఈ సందర్భంలో మనం ఒక స్పష్టమైన నిర్ణయానికి రావాలి. మతం పేరుతో జరిగే ప్రతి హింసను– అది ఏ మతానికి సంబంధించినదైనా–నిర్ద్వందంగా ఖండించాలి.

మనుషులుగా, సమాజంగా మన బాధ్యత ఏమిటంటే, మతాన్ని ద్వేషానికి ఆయుధంగా మార్చేవారిని గుర్తించడం, ప్రశ్నించడం, తిరస్కరించడం. దేవుని పేరు మనిషిని హింసించేందుకు, చంపేందుకు కాదు, మనిషిని మనిషిగా గౌరవించేందుకు. అదే నిజమైన భక్తి. అదే నిజమైన ధర్మం. ✤

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

## ముఖ్య ఆశయాలు

- సమాజంలో ప్రజాస్వామ్య విలువలు సర్వసామాన్యం కావడానికి, మానవుల మధ్య సోదరభావం పెంపొందడానికి, అంటరానితనం, నిమ్నోన్నతలూ, భేదభావాలు సమసిపోవడానికి, సాంఘిక న్యాయం నెలకొనడానికి ప్రజాచైతన్యాన్ని మేల్కొల్పడం.
- ముస్లిములు ముస్లిమేతరుల మధ్య సదవగాహన, సామరస్యం ఏర్పరచే వారధిని సృష్టించడం.
- ఇస్లాం, ముస్లింలు, ఇస్లామీయ ఉద్యమం గురించి ఏర్పడి ఉన్న అపార్థాలను, అపోహలను తొలగించటం.
- ఇస్లాం యొక్క నిజమైన బోధనల్ని ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా ప్రజలందరికీ తెలియజేయడం.

9

గతంలోకి ఒక చూపు..

# మేధావి వర్గం దృష్టిలో

**ఎస్.ఎమ్.మలిక్**

**సామాజిక** నవ నిర్మాణ కృషిలో గీటురాయి ప్రచురించిన వ్యాసాలు మేధావులూ పాత్రికేయుల దృష్టిని ఆకర్షించాయి. గీటురాయి నిష్పక్షపాత సమీక్షలు, విమర్శలు సమకాలీన పత్రికల్ని సయితం ఆకట్టుకున్నాయి. అవి ఎంతో స్వేచ్ఛగా, సుహృదయంతో తమ పేజీలలో గీటురాయి వ్యాసాలను లేదా వాటిలోని కొన్ని భాగాలను ముద్రించేవి. ఆ రోజుల్లోనే (1982) గీటురాయి కార్యాలయం తరపున లక్కడ్‌కోట్ వీధిలో ఏర్పాటు చేసిన 'ఈద్ మిలాప్' కార్యక్రమంలో అప్పటి "జాగృతి" సంపాదకులు, శ్రీ వేణుగోపాల్ రెడ్డి గారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఆ రోజుల్లోనే కొందరు మత గురువులు, సాహితీ వేత్తలు, సంఘ సేవకులతో ఇంటర్వ్యూలు జరిపింది గీటురాయి. వారిలో ప్రముఖ విప్లవ కవి శ్రీ శ్రీ, 'తెలుగు దేశం' పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ పర్వతనేని ఉపేంద్ర, గౌలిగూడలోని గురుద్వారా నిర్వాహకులు శ్రీ నానక్ సింగ్ నిష్తర్, జమాఅతె ఇస్లామీ హింద్ అధ్యక్షులు మౌలానా సిరాజుల్ హసన్, వామీ అధ్యక్షులు డా. అహ్మద్ తొతోంజీ ప్రభృతులు ఎన్నదగిన వారు. ఆ ఇంటర్వ్యూలకు మంచి ప్రతిస్పందనలు వచ్చేవి.

అలాగే శ్రీమతి మల్లాది సుబ్బమ్మ గారు నిర్వహించే కార్యక్రమాలలో గీటురాయి సంపాదకునిగా పాల్గొని అభిప్రాయాల మార్పిడి కొరకు, సమాజంలో మంచి అన్నది సర్వ సామాన్యం చేసే కృషిలో పాలు పంచుకునేందుకు అవకాశం దొరికేది.

## స్పందనలు

**'సంశయాలు సందేహాలలో ఊగిసలాడే జీవులు ఈ కవులు'** అనే, దివ్య ఖుర్‌ఆన్ వచనం (అష్ షుఅరా : 226) ఆధారంగా రూపొందించిన మకుటంతో శ్రీ శ్రీ గారి ఇంటర్వ్యూ ప్రచురించినప్పుడు కొందరు సహజంగానే నొచ్చుకున్నారు. ఆంధ్రజ్యోతి వారపత్రిక సంపాదకులు శ్రీ పురాణం సుబ్రహ్మణ్య శర్మ గారయితే తన లేఖలో, "అంత గొప్ప కవిని ఇంత ఘాటుగా విమర్శించడం" పట్ల నిరసనను వెలిబుచ్చారు. ఆ లేఖను గీటురాయిలో ప్రచురించి సమాధానం కూడా ఇవ్వడం జరిగింది. అలాగే 'ఈనాడు' దినపత్రికలో, 'కొత్త పుంతలు తొక్కుతున్న ఇస్లామ్ ప్రచారం' అనే హెడ్ లైన్‌తో వచ్చిన వ్యాసంలో ఇస్లామ్‌పై బురద జల్లే ప్రయత్నం జరిగింది. 'ఈనాడు' ధోరణిని ఖండిస్తూ గీటురాయిలో, "ఇస్లామ్‌ను తూలనాడు ఈనాడు" అనే లీడ్ ఆర్టికల్ వ్రాయడం జరిగింది. అలా స్పందించవలసింది కాదేమో అని ఆ తరువాత నాకు అనిపించింది.

★★★

## చందూర్ దంపతులు

నేను గీటురాయి ప్రారంభించే ముందు ఆంధ్ర ప్రభ వార పత్రికలో శ్రీమతి మాలతీచందూర్ నిర్వహించే శీర్షిక "జవాబులు"కు ప్రశ్నలు పంపేవాణ్ణి. ఆ విధంగా ఆమె గారికి నేను పరిచయమయ్యాను. ఆ పరిచయాన్ని పురస్కరించుకుని నేను మద్రాసుకు

వెళ్ళినప్పుడు ఆమె గారికి ఫోన్ చేసి వెళ్ళడం మొదలెట్టాను. ఆవిడగారు కూడా నేను వెళ్ళినప్పుడల్లా ఏదో ఒక విషయం పట్ల చర్చ జరిపేవారు. ఆ రోజుల్లో శ్రీ చందూర్ గారితో కూడా బాగా చనువు ఏర్పడింది. ఆయన కూడా చర్చలో పాల్గొనేవారు.




ఆ పరిచయం వల్లనే శ్రీమతి మాలతీచందూర్ చేత నీరోట్టమ్ పత్రిక ఎడిటర్, శ్రీ అడియార్ వ్రాసిన "నాన్ కాదలిక్కుమ్ ఇస్లామ్" అనే తమిళ పుస్తకం తెలుగులోకి అనువదించడానికి ఒప్పించగలిగాను. ఆ పుస్తకమే తెలుగులో **"నేను ఆరాధించే ఇస్లామ్."** 1987లో ఈ పుస్తకాన్ని గీటురాయిలో ధారా వాహికంగా ప్రచురించినప్పుడు అనువాదకురాలి కోరిక మేరకు ఆమె పేరు ప్రకటించ లేదు. కాని పాఠకుల ఒత్తిడికి తల ఒగ్గక తప్పలేదు. అయితే దాన్ని పుస్తకంగా ప్రింట్ చేసినప్పుడు ఆమె సమ్మతితో పేరు ప్రింట్ చేశాము. దాన్ని ఇప్పటికి 25 ఎడిషన్లు ముద్రించడం జరిగింది.

లోగడ ఓ సందర్భంలో ప్రవక్తశ్రీ(స) సచ్చరితకు సంబంధించిన 48 పేజీల ఓ చిరు పుస్తకం "ఆదర్శమూర్తి" పేరుతో వ్రాయడం తటస్థించింది. ఆ పుస్తకం ఇప్పటికి 86 ఎడిషన్లు ముద్రించడం జరిగింది అని సంపాదక సోదరులు అజీజుర్రహ్మాన్ తెలిపినప్పుడు దైవానికి కృతజ్ఞతలు అర్పించుకున్నాను. అప్పుడు, అంత కాలానికి ఆ పుస్తకాన్ని మరోసారి చదవాలన్న కోరిక కలిగి పుస్తకం తెప్పించి చదివాను. మాటిమాటికీ ముద్రించడం మూలంగానేమో కొన్ని అచ్చు తప్పులు కనిపించాయి. వాటిని తరువాతి ముద్రణల్లో సవరించవలసిందని సయ్యద్ హుస్సైన్ భాయ్‌కి సవరించిన ప్రతిని అందజేశాను.

# స్వేదం ఆరకముందే వేతనం :

- షేక్ హసన్ సాహెబ్

## న్యాయపీఠం చాటిన ప్రవక్త ధర్మం

**శ్రమకు మతం రంగు పులమలేం..** మానవత్వానికి సరిహద్దులు గీయలేం. పద్నాలుగు శతాబ్దాల క్రితం ఒక మహనీయుడు పలికిన మాట, నేడు న్యాయస్థానంలో ధర్మఘంటలా మోగింది. "శ్రామికుడి చెమట చుక్క ఆరకముందే అతని వేతనాన్ని చెల్లించండి" అన్న ప్రవక్త ముహమ్మద్ (స) వారి సూక్తిని ఉటంకిస్తూ మద్రాస్ హైకోర్టు వెలువరించిన తీర్పు.. వ్యవస్థల కళ్లు తెరిపిస్తోంది.

### ఆకలి కేక.. న్యాయమూర్తి కనికరం

మదురై మున్సిపల్ కార్పొరేషన్ కోసం 14ఏళ్ల పాటు తన మేధస్సును, కాలాన్ని ధారపోసిన ఒక న్యాయవాది, తన సొంత ఫీజు బకాయిల కోసం దశాబ్ద కాలంగా కోర్టు మెట్లు ఎక్కడం వ్యవస్థాగత వైఫల్యానికి పరాకాష్ట. తన వాదనలను వినిపించేందుకు కోర్టు పత్రాల కాపీలు తీసుకోవడానికి కూడా చిల్లిగవ్వ లేని ఆ న్యాయవాది దీనస్థితిని చూసి జస్టిస్ జి.ఆర్. స్వామినాథన్ హృదయం ద్రవించింది. అక్కడ ఉన్నది ఒక న్యాయవాది కాదు, శ్రమ దోపిడీకి గురవుతున్న ఒక సామాన్య శ్రామికుడని గుర్తించిన ధర్మాసనం.. ఇస్లామిక్ ధర్మ శాస్త్రంలోని అత్యున్నత సూత్రాన్ని గుర్తుచేసింది.

### కార్మిక న్యాయానికి అది ప్రాణవాయువు

"చెమట ఆరేలోపే వేతనం అందాలి" అనే సూత్రం కేవలం ఒక మత బోధన కాదు,అది ఆధునిక కార్మిక న్యాయశాస్త్రానికే (Labour Jurisprudence) దిక్సూచి అని న్యాయమూర్తి స్పష్టం చేశారు. బాధితుడికి రావాల్సిన రూ.13.05 లక్షల బకాయిలను తక్షణమే చెల్లించాలని మున్సిపల్ యంత్రాంగాన్ని ఆదేశించడమే కాకుండా, శ్రమ విలువను తక్కువ చేసి చూపే ధోరణిని ఎండగట్టారు.

### కాలపు వైరుధ్యం: ఒకచోట ప్రశంస.. మరోచోట శిక్ష

ఈ తీర్పు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమవుతున్న వేళ, సమాజంలోని వింత పోకడలను కూడా మనం గమనించాలి. ఒకవైపు మద్రాస్ హైకోర్టు ప్రవక్త బోధనల్లోని అంతరార్థాన్ని న్యాయానికి ప్రాతిపదికగా తీసుకుంటే, మరోవైపు ఆడపిల్లల భద్రత గురించి ప్రవక్త మాటలను ఉదహరించిన ఒక పోలీస్ అధికారిపై చర్యలు తీసుకోవడం విచారకరం.

### న్యాయపీఠం ఎక్కితే అది 'ధర్మ సూక్తి'..

యంత్రాంగంలో చెబితే అది 'నేరమా'? ఇలాంటి వైరుధ్యాలు ఆరోగ్యకరమైన సమాజానికి సంకేతాలు కావు.

### ముగింపు: సత్యం ఎక్కడ ఉన్నా సమ్మతమే

మతం ఏదైనా, సూక్తి ఎక్కడిదైనా.. అందులో మానవత ఉంటే అది సర్వజన ఆమోద్యం. జస్టిస్ స్వామినాథన్ తన తీర్పు ద్వారా ఒక గొప్ప సందేశాన్ని ఇచ్చారు: శ్రమకు కులం లేదు, ఆకలికి మతం లేదు. ప్రభుత్వ యంత్రాంగాలు ఇప్పటికైనా ఫైళ్లలో చిక్కుకున్న సామాన్యుల శ్రమను, వారి వేతనాలను విడుదల చేయాలి. స్వేదం చిందించిన వాడి కడుపు కాల్చడం కంటే పెను నేరం మరొకటి లేదు. ఈ తీర్పు కేవలం ఒక న్యాయవాది గెలుపు కాదు, శ్రమను నమ్ముకున్న ప్రతి జీవికి దక్కిన గౌరవం. ❖

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్‌హీముల్ ఖుర్ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

38 ఆయత్‌లు

# 47. ముహమ్మద్

మదీనా అవతరణ

15 ఇది ఎక్కడయినా సంభవమా? నిష్ఠాగరిష్ఠులయిన వారి కొరకు ఎటువంటి స్వర్గం గురించి వాగ్దానం చెయ్యడం జరిగిందో దాని వైభవం ఏమిటంటే, అందులో వడబోసిన నీటి కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి, రుచిలో ఏమాత్రం వ్యత్యాసం రాని పాల సెలయేరులు పారుతుంటాయి, సేవించేవారి కొరకు రుచికరమయిన మద్యం కాలువలు పారుతూ ఉంటాయి, అతి స్వచ్ఛమయిన తేనె సెలయేరులు ప్రవహిస్తూ ఉంటాయి.[23] అందులో వారికోసం అన్ని రకాల ఫలాలుంటాయి, వారి ప్రభువు పక్షాన మన్నింపు లభిస్తుంది.[24] (ఎవరి భాగ్యంలో ఈ స్వర్గం లభించనున్నదో) అతను, నరకంలో సదా ఉండిపోయేవారిలా, (పేవుల్ని సయితం త్రెంపివేసే వేడి నీళ్ళు త్రాపించబడేవారిలా ఎలా అవుతాడు?

16 – 17 వీరిలో కొందరున్నారు, చెవులొగ్గి నీ మాట వింటారు, నీ వద్ద నుండి వెలికిరాగానే జ్ఞాన సౌభాగ్యం ప్రసాదించబడిన వారిని అడుగుతారు, 'అవునూ, ఈయనగారు ఇప్పుడు చెప్పినదేమిటీ?'అని.[25] హృదయాలపైన దైవం ముద్ర వేసినటువంటి వారు వీరు, వీరు తమ మనోకాంక్షలను అనుసరించేవారయిపోయారు.[26] పోతే ఎవరయితే సన్మార్గబోధన పొందారో వారికి అల్లాహ్ మరింత మార్గబోధన చేస్తాడు,[27] భయభక్తుల వారి వాటా వారికి ప్రసాదిస్తాడు.[28]

23. మర్ఫూ హదీసులో దీని వివరణ ఇలా ఉంది, "అది తేనెటీగల కడుపు నుండి వెలువడిన తేనె కాదు", అంటే అదీ ఊటల నుండి ఉబికి కాలువలలో ప్రవహిస్తుందన్నమాట. అందు వల్లనే అందులో మైనం, తుట్టె ముక్కలు, చచ్చిన ఈగల కాళ్ళూ కలసి ఉండవు. దానికి బదులు అది స్వచ్ఛమయిన తేనెయై ఉంటుంది.

24. స్వర్గంలో ప్రాప్తమయ్యే ఈ వరప్రసాదాల తరువాత దైవ క్షమాపణ ప్రస్తావనకు రెండు అర్థాలు కావచ్చు. ఒకటి, ఈ వరప్రసాదాలన్నింటినీ మించిన మహా వరప్రసాదం పరమ ప్రభువు అల్లాహ్ వారిని మన్నించి క్షమాభిక్ష ప్రసాదించడం. రెండవ భావం, ప్రపంచంలో వారివల్ల జరిగిన లోటుపాట్లు ఏమయినా ఉంటే వాటి ప్రస్తావన కూడా స్వర్గంలో ఎన్నడూ వారి సమక్షంలో జరగదు. పరమ ప్రభువు శాశ్వతంగా వాటిపైన తెర దించి వేస్తాడు, వారు స్వర్గంలో సిగ్గిల్లకుండా ఉండేందుకు.

25. ఇది, ప్రవక్త మహనీయులు (స) సమావేశాల్లో వచ్చి కూర్చునే తిరస్కారులు, కపటులు, గ్రంథవహులలోని తిరస్కారుల ప్రస్తావన. వారు ఆయన ప్రబోధాలను, దివ్య ఖుర్ఆన్ ఆయత్‌లను వినేవారు. కాని వారి హృదయాలు ఆయన నోటి నుండి వెలువడే విషయాలకు బహుదూరమయినవి గనక వారు అంతా విని కూడా ఏమీ వినని వారిలానే బయటికి వచ్చి ముస్లిములను అడిగేవారు, "అవునూ, ఇప్పుడు ఈయనగారు (స) చెప్పినదేమిటీ" అని.

26. ఇదీ అసలు కారణం, దీని మూలంగానే వారి హృదయ కర్ణాలు ప్రవక్త మహనీయుల ప్రబోధాలకు చెవిటివయి పోయాయి. వారు తమ కోరికలకు దాసులు. ప్రవక్త(శ్రీ (స) బోధించే ఉపదేశాలేమో వారి కోరికలకు వ్యతిరేకమయినవి. అందువల్ల ఎప్పుడయినా వారు మొగమాటంగా ఆయన సభలో వచ్చి కూర్చున్నా, ఆయన వైపు చెవులొగ్గి విన్నా వారికి ఏమీ తలకెక్కేది కాదు.

27. అంటే, తిరస్కారులూ కపటులూ, 'ఇప్పుడు ఆయనగారు (స) సెలవిచ్చినదేమిటీ' అని ప్రశ్నిస్తున్న ఆ విషయాలే మార్గ బోధన పొందినవారికి మరింత జ్ఞాన బోధనకు కారణమవు తాయి. మరే సభలో కూర్చుని ఆ దౌర్భాగ్యులు తమ సమయం వృథా చేసుకుని లేచివస్తారో ఆ సభల నుంచే ఈ సౌభాగ్య వంతులు జ్ఞానం విజ్ఞతల సరికొత్త సంపదను పొంది మరీ మరలుతారు.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (6వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమా౦ (ర.అలై)

తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ التَّفْسِيرِ

## ఖుర్ఆన్ వ్యాఖ్యాన ప్రకరణం

(కితాబుత్తఫ్సీర్)

**2. అల్ బఖరా**

### అధ్యాయం : 43

## ప్రమాదం పొంచి ఉన్నప్పుడు...

దైవోపదేశం: "పరిస్థితులు ప్రమాదకరంగా ఉంటే, నడుస్తూ ఉన్నా లేక స్వారీ చేస్తూ ఉన్నా, ఎలా సాధ్యమైతే అలా నమాజు చెయ్యండి. శాంతిభద్రతలు నెలకొన్న తరువాత అల్లాహ్ మీకు నేర్పిన పద్ధతి ప్రకారం ఆయనను స్మరించండి. ఈ పద్ధతి పూర్వం మీకు తెలియదు." *(2 : 239)*

**382)** నాఫె ఇలా వివరించారు: ప్రమాదకర స్థితిలో నమాజ్ చేయటం గురించి అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి)ని అడిగినప్పుడు ఆయన ఇలా విడమరిచి చెప్పారు: "ఆ సమయంలో ఇమామ్ (నాయకుడు) ముస్లింల ఒక జట్టును తీసుకుని, తాను స్వయంగా ముందుండి ఒక రకఅత్ నమాజ్ చేయించాలి. ఈ సందర్భంగా నమాజ్‌లో పాల్గొనని ముస్లింల మరో జట్టు ఈ నమాజీలకు– శత్రువులకు మధ్యన (గోడలా) నిలబడి ఉండాలి.

ఇమామ్ ఒక రకఅత్ నమాజ్ చేయించిన మీదట, అతనితో కలసి ఒక రకఅత్ నమాజ్ చేసిన వారంతా వెనక్కి వెళ్ళి, ఇప్పటివరకూ నమాజ్ చేయకుండా ఉన్న రెండవ జట్టు స్థానంలో నిలబడాలి. అయితే వారు 'సలామ్' చేయకూడదు. ఇప్పుడు నమాజ్ చేయని వారంతా వచ్చి ఇమామ్ వెనుక (వరుసలు తీరి) నిలబడాలి. ఇమామ్ గారు వారికి కూడా ఒక రకఅత్ సామూహిక నమాజ్ చేయించాలి. ఆ విధంగా ఇమామ్‌కు రెండు రకతులు లభించాయి గనక అతను నమాజ్‌ను విరమిస్తాడు. (ఇప్పుడు ఇమామ్ వెనుక నిలబడి ఒక్కో రకఅత్ చొప్పున నమాజ్ చేసిన ఇరుజట్లు కూడా) తమ మిగిలిన ఒక్కో రకఅత్‌ను– వీలు చూసుకుని పూర్తి చేసుకోవాలి) ఆ విధంగా ఇరు జట్లకు రెండేసి రకతుల నమాజ్ లభిస్తుంది. కాని ప్రమాదం లేక భయోత్పాతం ఇంతకన్నా తీవ్రంగా ఉన్నప్పుడు ప్రతి వ్యక్తీ ఒంటరిగా నమాజ్ చేసుకోవాలి. నడుస్తూ ఉన్నా గాని, వాహనంపై ఉన్నా గాని, ఖిబ్లా వైపు తిరిగి ఉన్నా సరే, లేకున్నా సరే"–

అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) గారు ఈ పలుకులు దైవప్రవక్త(స) ద్వారా విని మనకు విశదీకరించారని నాకు గట్టి నమ్మకం ఉందని నాఫె అన్నారు.

### అధ్యాయం : 44

దైవోపదేశం: "మీలోని వారెవరయినా మరణించి, వారి భార్యలు సజీవంగా ఉంటే, వారు తమ భార్యలకు ఒక సంవత్సరం వరకు భరణపు ఖర్చులు ఇవ్వాలనీ, వారిని ఇంటినుండి బహిష్కరించరాదనీ ఒక వీలునామా వ్రాయాలి."[1] (2: 240)

**383)** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి) గారు ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ (రజి)తో, అల్ బఖరా సూరాలోని 240వ ఆయత్‌ను ఉదాహరిస్తూ, **"వారు తమంతట తామే వెళ్ళిపోయి తమ విషయంలో ధర్మసమ్మతంగా ఏమి చేసినా దానికి మీరు బాధ్యులు కారు"** అని సెలవీయబడింది. తరువాత మరొక ఆయత్ ద్వారా ఇది రద్దు చేయబడింది కదా! మరలాంటప్పుడు, తమరు మీ 'మస్‌హఫ్' (లిఖిత ప్రతి)లో దీనిని ఎందుకు వ్రాయించారు? దీనిని ఎందుకు వదలివేయలేదు?' అని ప్రశ్నించగా ఉస్మాన్(రజి) ఇలా సమాధానమిచ్చారు: "ఓ నా భ్రాతృజుడా! నేను ఏ ఆయత్‌ను కూడా, అది ఉన్న స్థానంలో నుండి తొలగించలేను" లేదా ఇలాంటి మాటే అన్నారని హుమైద్ చెప్పారు.

---

*44-1.కాని ఈ ఆజ్ఞ తరువాత రద్దు అయింది.*




ఈ అనంత విశ్వంలో మనిషి ప్రయాణం ఒక వింతైన మలుపులో ఉంది. బయట భౌతిక సౌకర్యాల వెలుగులు జిగేల్మంటున్నా, లోపల మాత్రం అంధకారం అలుముకుంటోంది. ఆధునిక ప్రపంచం మనకు అన్నీ ఇచ్చింది కానీ, 'ప్రశాంతత' అనే ఒక్క అమృత భాండాన్ని మాత్రం దూరం చేసింది. గడియారం ముల్లుతో పోటీ పడుతూ పరుగులు తీస్తున్న మన జీవితాల్లో, మనసు ఎప్పుడూ ఏదో తెలియని వెలితితో, అశాంతితో అల్లాడిపోతోంది.

మనం చేసే ప్రార్థనలు పెదవుల మీద ఆగిపోతున్నాయా? మన విశ్వాసం కేవలం మతపరమైన ఆచారాలకే పరిమితమైందా? ఆత్మను తాకని ఆరాధన, దాహాన్ని తీర్చని ఎండమావి వంటిది. సృష్టికర్తను కేవలం కష్టాల్లోనో, లేక రోజులో కొన్ని నిమిషాల ప్రార్థనలోనో తలుచుకుంటూ.. మిగిలిన సమయమంతా ఈ లౌకిక మాయాజాలంలో మునిగిపోతే, గుండె గూటికి శాంతి ఎలా చేరుతుంది?

''నిశ్శబ్దపు కేక నుంచి నిండైన శాంతి వరకు'' సాగే ఈ ఆత్మ ప్రయాణం.. మనల్ని మనం వెతుక్కునే ప్రయాణం. ఇది కేవలం అక్షరాల కూర్పు కాదు, అశాంతి కడలిలో కొట్టుమిట్టాడుతున్న మనసుకు అల్లాహ్ స్మరణ (జిక్ర్) అనే పడవను పరిచయం చేసే ఒక చిరు ప్రయత్నం. మన ప్రతి శ్వాస ఆ పరమ ప్రభువు నామంతో పునీతమైతే, ఈ జీవితం ఎంతటి సుందరమైన ఆధ్యాత్మిక కావ్యంగా మారుతుందో తెలుసుకుందాం!

## అల్లాహ్ స్మరణలో ఆత్మప్రయాణం

మనం శాంతి మార్గంలో నడుస్తున్నామని అనుకుంటాం. కానీ అశాంతి మన నీడలా వెన్నాడుతూనే ఉంటుంది. గణాంకాలు చూస్తే, ముస్లిం ప్రపంచంలో కూడా ఆందోళన (Anxiety), కుంగుబాటు (Depression) మిగతా ప్రపంచానికి ఏమాత్రం తక్కువ కాదని తెలుస్తుంది. మరి ఎక్కడ లోపం జరుగుతోంది? ''శాంతి మార్గం'' అని పిలువబడే మన ధర్మం, మన అంతరంగానికి ఆ చల్లదనాన్ని ఎందుకు అందించలేకపోతోంది?

## అలవాటైన అబద్ధం - అన్వేషించని సత్యం

చాలా కాలం పాటు నా అంతరాత్మను ప్రశ్నించుకోవడానికి భయపడ్డాను. ఎందుకంటే, నా విశ్వాసం నా అస్తిత్వానికి పునాది. ఆ పునాదిని కదిలిస్తే నా జీవితం కుప్పకూలుతుందేమో అన్న భయం. సమాజం ఏమనుకుంటుందో అన్న సంకోచం. కానీ, నొప్పి భరించలేనంతగా పెరిగినప్పుడు మన ముందు రెండే దారులుంటాయి: ఆ నొప్పికి లొంగిపోయి జీవితాంతం బానిసగా మిగిలి పోవడం, లేదా ఆ నొప్పిని ఒక పాఠంగా మార్చుకుని కొత్త మనిషిగా ఎదగడం.

నేను రెండో దారిని ఎంచుకున్నాను. తల ఎత్తి ఆకాశం వైపు చూసి అడిగాను "నా విశ్వాసం నన్నెందుకు ఓదార్చలేకపోతోంది?"

## 2 శాతం ముస్లింలుగానే మిగిలిపోతున్నామా?

లోతుగా ఆలోచిస్తే ఒక చేదు నిజం బయటపడింది. నేను అల్లాహ్‌కు 'లొంగిపోయాను' అని నమ్మాను. కానీ ఆ లొంగుదల కేవలం నా రోజులో 35 నిమిషాల నమాజుకు మాత్రమే పరిమితమైంది. అంటే, 24 గంటల జీవితంలో కేవలం 2 శాతం మాత్రమే

నేను అల్లాహ్‌తో ఉంటున్నాను. మిగతా 98 శాతం సమయం నా ఆలోచనలు, నా ప్రవర్తన, నా తపన అంతా లౌకికమైపోయింది.

కేవలం 2 శాతం సమయాన్ని కేటాయించి, వంద శాతం శాంతిని ఆశించడం అత్యాశే అవుతుంది కదా? మనం కేవలం ఆలోచనల్లో మాత్రమే ముస్లింలం కాదు, ప్రతి శ్వాసలోనూ ముస్లింలుగా మారాలి.

### అల్లాహ్: జీవితపు అంచున కాదు, కేంద్ర బిందువుగా..

మనం మనుషులం- అంటే నిరంతరం మర్చిపోయే స్వభావం కలవారము. అందుకే అల్లాహ్ మనల్ని పదే పదే స్మరించమని కోరాడు. శాంతి అనేది ఏదో గమ్యం కాదు, అది ప్రతి క్షణం అల్లాహ్‌ను స్మరించడం వల్ల కలిగే ఒక స్థితి.

**కృతజ్ఞతతో కూడిన ఉదయం** : నిద్రలేవగానే మరో అవకాశం ఇచ్చినందుకు ఆ సృష్టికర్తకు కృతజ్ఞతలు చెప్పండి.

**చిన్న చిన్న అద్భుతాలు** : ముఖం కడుగుతున్నప్పుడు ఆ నీటి స్పర్శను, నడుస్తున్నప్పుడు మీ పాదాల శక్తిని, చూస్తున్నప్పుడు మీ కంటి వెలుగును అల్లాహ్ ఇచ్చిన ప్రసాదంగా గుర్తించండి.

**నిరంతర సంభాషణ** : పనిలో ఉన్నా, ప్రయాణంలో ఉన్నా మీ అంతరంగం అల్లాహ్‌తో మాట్లాడుతూనే ఉండాలి.

శాంతి అనేది మీ గుండె చప్పుడులో అల్లాహ్ పేరు ప్రతిధ్వనించినప్పుడు లభిస్తుంది. మన లోపాలను నిజాయితీగా అంగీకరిద్దాం. మన విశ్వాసాన్ని ఆచారాల నుంచి ఆచరణలోకి మళ్ళిద్దాం.

ఎప్పుడైతే అల్లాహ్, మన జీవితానికి కేంద్ర బిందువుగా మారుతాడో.. అప్పుడే అంతులేని ఆ శాంతి మన సొంతమవుతుంది. ఆ వెలుగుతోనే మనం ఈ చీకటి ప్రపంచానికి వెలుగుగా మారగలం.

ఖచ్చితంగా, 'జిక్ర్' (స్మరణ) కేవలం ఆధ్యాత్మిక ప్రక్రియ మాత్రమే కాదు, అది మానసిక స్థితిని సమూలంగా మార్చే ఒక శక్తివంతమైన సాధనం.

### జిక్ర్; ఆత్మకు ప్రాణవాయువు.. అశాంతికి దివ్యౌషధం

మనసు ఒక ప్రవాహం లాంటిది. దానికి సరైన దిశ చూపకపోతే అది ఆందోళనల వైపు, గతం తాలూకు బాధల వైపు ఉరకలు వేస్తుంది. అల్లాహ్‌ను స్మరించడం (జిక్ర్) అంటే ఆ ప్రవాహానికి ఒక గట్టును నిర్మించడం.

### 1. జిక్ర్; ఒక మానసిక కవచం

మనం రోజులో చేసే 'సుభానల్లాహ్', 'అల్హందులిల్లాహ్', 'అల్లాహు అక్బర్' వంటి స్మరణలు కేవలం పెదవుల మీద పలికే పదాలు కావు. అవి మన ఆలోచనల మీద వేసే ఒక క్రమశిక్షణ.

**వర్తమానంలో బ్రతకడం** : మానసిక ఆందోళన (Anxiety) అంటే భవిష్యత్తు గురించి భయం. కుంగుబాటు (Depression) అంటే గతం గురించి బాధ. కానీ మీరు 'జిక్ర్' చేస్తున్నప్పుడు, మీ మెదడు ప్రస్తుత క్షణంపై (Present Moment) దృష్టి పెడుతుంది. ఇది సైకాలజీలో చెప్పే 'మైండ్‌ఫుల్‌నెస్' (Mindfulness) కు అసలైన రూపం.

### 2. హృదయ స్పందనలో స్థిరత్వం

"అల్లాహ్‌ను స్మరించడం వల్లనే హృదయాలకు శాంతి లభిస్తుంది" (ఖురాన్). ఇది కేవలం వాక్యం కాదు, ఒక పరమ సత్యం.

మనం ఒత్తిడిలో ఉన్నప్పుడు మన మెదడులో 'కార్టిసోల్' అనే హార్మోన్ విడుదలవుతుంది. కానీ ఏకాగ్రతతో జిక్ర్ చేసినప్పుడు, మన నాడీ వ్యవస్థ శాంతించి, మనసులో ప్రశాంతతను నింపే ఎండార్ఫిన్లు విడుదలవుతాయి. జిక్ర్ అనేది ఆత్మకు చేసే 'మెడిటేషన్'.

### 3. 'నేను' నుంచి 'ఆయన' వైపునకు..

మన అశాంతికి ప్రధాన కారణం "నేను.. నా సమస్య.. నా కెరీర్.. నా ప్రతిష్ట" అనే స్వార్థపూరిత ఆలోచనలు.

➢ మీరు 'అల్హందులిల్లాహ్' (సర్వస్తోత్రాలు అల్లాహ్‌కే) అన్నప్పుడు, మీ దృష్టి మీ లోపాల నుండి మీకున్న అనుగ్రహాల వైపు మళ్ళుతుంది.

➢ మీరు 'లా హౌలా వలా ఖువ్వతా ఇల్లా బిల్లా' అన్నప్పుడు, "నేను ఒంటరినికాను, నా వెనుక మహా శక్తి ఉంది" అన్న ధైర్యం కలుగుతుంది. ఈ మార్పు మీ అహాన్ని తగ్గించి, వినయాన్ని, తద్వారా అపారమైన మానసిక బలాన్ని ఇస్తుంది.

### 4. అలవాటుగా కాదు.. అనుభూతిగా మార్చుకోండి

జిక్ర్ అనేది ఒక యాంత్రిక ప్రక్రియ కాకూడదు.

➢ **కళ్ళతో జిక్ర్** : ప్రకృతిని చూసి అల్లాహ్ గొప్పతనాన్ని తలుచుకోండి.

➢ **చెవులతో జిక్ర్** : మంచి మాటలను, ఖురాన్ పఠనాన్ని వింటూ పరవశించండి.

➢ **చేతులతో జిక్ర్** : ఇతరులకు సహాయం చేస్తూ ఆ సృష్టికర్తను స్మరించండి.

కేవలం 2 శాతం ప్రార్థనతో మిగిలిన 98 శాతం జీవితాన్ని నెట్టుకు రావడం అసాధ్యం. ప్రతి శ్వాసలోనూ ఆయన్ని ప్రతిష్ఠించుకున్నప్పుడే, బయట ప్రపంచం ఎంత అల్లకల్లోలంగా ఉన్నా, మీ అంతరంగం మాత్రం ఒక నిశ్శబ్ద సముద్రంలా ప్రశాంతంగా ఉంటుంది.

అల్లాహ్ స్మరణే మనల్ని ఒంటరితనం నుండి, నిరాశ నుండి కాపాడుతుంది.

కథ

- షహనాజ్, అనంతపురం




# పాపభీతి

**"మనిషి చేసే ప్రతి తప్పూ ఒక అడుగు ముద్ర లాంటిది. కాలక్రమంలో అది మాయమైపోతుందని మనం అనుకుంటాం, కానీ అది అంతరాత్మ అనే ఇసుక తిన్నెలపై చెరగని ముద్రగా మిగిలిపోతుంది. చేసిన పాపం వెంటాడితే, కలిగే భయం మరణం కంటే భయంకరంగా ఉంటుంది. అపరాధ భావం నుండి పుట్టిన 'పాప భీతి' ముగ్గురు స్నేహితుల జీవితాలను ఎలా మార్చిందో, వారిని మానవత్వం వైపు ఎలా నడిపించిందో తెలిపే హృద్యమైన కథే ఇది."**

**ఆసిఫ్ అలీ** ఆ రాత్రంతా నిద్రపోలేదు. కిటికీలోంచి కనిపిస్తున్న చీకటి తనను మింగేయడానికి వస్తున్న భూతంలా అనిపిస్తోంది. కొన్నాళ్లుగా ఏదో తెలియని అశాంతి, గుండెపై ఎవరో బరువుగా కాలు పెట్టి తొక్కుతున్నట్లు అనిపిస్తోంది. ఆసిఫ్ ఒక్కడే కాదు, అతని స్నేహితులు అర్షద్, ఆరిఫ్‌ల పరిస్థితి కూడా అలాగే ఉంది. మర్నాడు ఉదయం ముగ్గురూ ఒక చోట కలిశారు. అందరి ముఖాల్లోనూ నీడలు కమ్ముకుని ఉన్నాయి.

"నేను ఇక భరించలేను మిత్రమా!" అన్నాడు అర్షద్ నీరసంగా. "గత నెల బస్సు ప్రమాదంలో నా కొడుకు గాయపడటం, తృటిలో ప్రాణాలు దక్కడం... ఇవన్నీ యాదృచ్ఛికం అంటే నా మనసు నమ్మడం లేదు. నా పాపమే నా బిడ్డను చుట్టుముడుతోందని భయంగా ఉంది."

ఆరిఫ్ కళ్లు కూడా చెమర్చాయి. "నా ఉద్యోగంలో జరిగిన పొరపాటు వల్ల జైలు శిక్ష అనుభవించి వచ్చాను. కానీ ఆ నాలుగు గోడల మధ్య నేను అనుభవించిన నరకం కంటే, నా అంతరాత్మ నన్ను వేధిస్తున్న నరకమే భయంకరంగా

ఉంది. మనం ఏదో తప్పు చేశాం. అందుకే దేవుడు మనల్ని వదలడం లేదు.”

ఆసిఫ్ అలీ దీర్ఘంగా నిట్టూర్చాడు. అతని కళ్ల ముందు మూడేళ్ల క్రితం జరిగిన ఆ రాత్రి దృశ్యం కదలాడింది.

అదొక సెలవు దినం. ముగ్గురు స్నేహితులూ కలిసి ఫామ్ హౌస్‌లో ఆ రోజంతా హుషారుగా గడిపారు. సాయంత్రం చీకటి పడుతుండగా తిరుగు ప్రయాణమయ్యారు. కారు ఆసిఫ్ నడుపుతున్నాడు. లోపల నవ్వులు, పాటలు, కబుర్లు... వేగం 100 దాటింది.

హఠాత్తుగా... ఎక్కడి నుండి వచ్చిందో తెలీదు, ఒక ఆకారం రోడ్డుపైకి వచ్చింది. “ఆసిఫ్! బ్రేక్... బ్రేక్!!” అని అర్షద్ అరిచేలోపే జరగకూడనిది జరిగిపోయింది.

ఒక భయంకరమైన శబ్దం... ఆ తర్వాత గుండెలు పిండేసే ఆర్తనాదం. ఒక స్త్రీ శరీరం కారు చక్రాల కింద నలిగిపోయింది. ఆగి చూసే ధైర్యం లేకపోయింది. అల్లంత దూరంలో జనం గుమిగూడటం చూసి, “పోలీస్ కేసు అవుతుంది, మన జీవితాలు నాశనమైపోతాయి” అన్న భయంతో ఆసిఫ్ కారును వేగంగా పోనిచ్చాడు.

మర్నాడు వార్తల్లో వచ్చింది: “గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి. గుర్తు పట్టలేని స్థితిలో శవం.”

ఆ రోజు వారు ఊపిరి పీల్చుకున్నారు. “హమ్మయ్య! ఎవరికీ తెలీదు, మనం బతికిపోయాం” అని పార్టీలు చేసుకున్నారు. కానీ, మనుషుల కళ్లను కప్పగలిగారు కానీ, ఆ పైవాడి కళ్లను కప్పలేమని వారికి అప్పుడు తెలీదు.

“ఆ రోజు నుంచి మన ఇంట్లో ప్రశాంతత లేదు,” అన్నాడు ఆసిఫ్ గొంతు పెగుల్చుకుంటూ. “ఒకరి ఇంట్లో అగ్ని ప్రమాదం, మరొకరికి అనారోగ్యం, ఇంకొకరికి జైలు... ఇదంతా ఆ రోడ్డుపై మనం వదిలేసిన ఆ అభాగ్యురాలి శాపం కాదా?”

“మరి ఇప్పుడు ఏం చేద్దాం?” అన్నాడు ఆరిఫ్ భయంగా.

“ప్రాయశ్చిత్తం!” అన్నాడు ఆసిఫ్ దృఢంగా. “శిక్షకు భయపడి మనం మన మానవత్వాన్ని చంపేసుకున్నాం. ఇప్పుడు ఆ తప్పును సరిదిద్దుకోవాలి. పదండి.”

ముగ్గురూ కలిసి సరిగ్గా మూడేళ్ల క్రితం ప్రమాదం జరిగిన ఆ ప్రదేశానికి వెళ్లారు. అక్కడ ఆ చుట్టుపక్కల ఆరా తీస్తే తెలిసిన నిజం వారి గుండెలను పిండేసింది. ఆ చనిపోయిన మహిళకు ఇద్దరు చిన్న పిల్లలు. తల్లి చనిపోయాక, తండ్రి ఎప్పుడో వదిలేసి వెళ్ళిపోవడంతో ఆ పిల్లలు దిక్కులేని పక్షులయ్యారు. పూట గడవడమే కష్టంగా ఉంది.

ఆ పిల్లల దీనస్థితి చూసి ఆసిఫ్, అర్షద్, ఆరిఫ్ కన్నీళ్లు పెట్టుకున్నారు. తమ విలాసం కోసం ఒక తల్లిని పొట్టన పెట్టుకుని, ఇద్దరు పసిపిల్లల జీవితాల్లో చీకటి నింపినందుకు వారికి తమ మీద తమకే అసహ్యం వేసింది.

వారు ఆ పిల్లల దగ్గరకు వెళ్లారు. వారికి కావలసిన ఆర్థిక సాయం అందించారు. “మేమున్నాం.. మీకు ఏ కష్టం వచ్చినా మేము చూసుకుంటాం” అని మాట ఇచ్చారు. వారి చదువుల బాధ్యతను స్వీకరించారు. ఆ పిల్లల కళ్లలో కనిపించిన చిన్నపాటి మెరుపు వారి మనసులోని భారంలో సగాన్ని తగ్గించింది.

అయినా ఆసిఫ్ ఆగిపోలేదు. “మిత్రులారా! పిల్లలకి సాయం చేశాం, అది మన బాధ్యత. కానీ మనం చట్టం నుంచి తప్పించుకున్నాం. దానికి కూడా ప్రాయశ్చిత్తం కావాలి.”

ముగ్గురూ నేరుగా పోలీస్ స్టేషన్ వైపు అడుగులు వేశారు.

“ప్రమాదం యాదృచ్ఛికం కావచ్చు, కానీ దాన్ని దాచడం నేరం. ఆ పాప భీతి మాకు నిజమైన మనిషిని పరిచయం చేసింది. ఇప్పుడు ఏ శిక్ష పడినా మాకు బాధ లేదు, ఎందుకంటే మా అంతరాత్మకు విముక్తి లభించింది,” అని వారు స్టేషన్ మెట్లు ఎక్కుతుంటే, మనసులో ఒక రకమైన ప్రశాంతత నిండింది.

ఆకాశం వంక చూశారు... ఇన్నాళ్లకు ఆకాశం వారికి నిర్మలంగా కనిపించింది.

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక



# కుటుంబ విలువల పునర్నిర్మాణం అవసరం

## జనవరి 1, గ్లోబల్ ఫ్యామిలీ డే

**- నుస్రత్ పర్వీన్**

**డిజిటల్ యుగపు 'హై-స్పీడ్' ప్రయాణంలో మనిషి అనంతమైన సమాచారాన్ని ప్రోగుచేసుకుంటున్నాడు కానీ, తన గుండె చప్పుడును పంచుకునే 'నెట్‌వర్క్'ను మాత్రం కోల్పోతున్నాడు. నేడు మన ఇళ్లు కేవలం భౌతికమైన అడ్రస్‌లుగా మిగిలిపోతున్నాయి. మనుషుల మధ్య 'కనెక్టివిటీ' పెరిగింది కానీ, మనసుల మధ్య 'సింక్రోనైజేషన్' (Synchronization) విచ్ఛిన్నమవుతోంది. కుటుంబం అంటే కేవలం డేటాబేస్‌లో ఉండే పేర్ల జాబితా కాదు, అది ప్రేమానురాగాల 'కోడింగ్'తో నిర్మితమైన ఒక అద్భుత కావ్యం. ఒకే ప్రాణం నాలుగు రూపాల్లో ప్రతిబింబించే అద్దం. కష్టాల వైరస్ దాడి చేసినప్పుడు రక్షణ కవచంలా నిలిచే 'ఫైర్‌వాల్' (Firewall) అది. కానీ, ఆధునిక సమాజపు వ్యక్తివాదం అనే వైరస్ నేడు ఆ వ్యవస్థనే 'క్రాష్' చేస్తోంది.**

**ఖుర్ఆన్ బోధించిన ప్రేమలోని గాఢత, ప్రవక్త(స) జీవితం నేర్పిన బాధ్యతాయుత పెంపకం- ఇవి కేవలం మతపరమైన సూత్రాలు కావు, అవి ఛిన్నాభిన్నమవుతున్న మానవ సంబంధాలను సరిచేసే 'మాస్టర్ కోడ్స్'. భార్యాభర్తల మధ్య వస్త్రం లాంటి రక్షణను, తల్లి పాదాల చెంత స్వర్గం లాంటి గౌరవాన్ని, తండ్రి ఆదరణను దర్శించినప్పుడే కుటుంబం అనే 'ఆపరేటింగ్ సిస్టమ్' మళ్ళీ శక్తివంతంగా పనిచేస్తుంది.**

**ముక్కలవుతున్న బంధాలను అతికించే 'ప్రేమ' అనే ప్రోటోకాల్‌ను మనం మళ్ళీ ఎలా రీ-ఇన్‌స్టాల్ చేసుకోవాలో, యాంత్రికత నుంచి ఆత్మీయత వైపు మనిషిని ఎలా మళ్ళించాలో ఆవిష్కరించే ప్రయాణమే ఈ వ్యాసం**

**మానవ** నాగరికత పరిణామ క్రమంలో ఎన్ని మార్పులు వచ్చినా, సమాజానికి వెన్నెముకగా నిలిచింది మాత్రం 'కుటుంబం'. కానీ, 21వ శతాబ్దపు పరుగుల జీవితంలో, భౌతిక సుఖాల వేటలో మనిషి తన ఉనికికి మూలమైన కుటుంబపు వెచ్చదనాన్ని కోల్పోతున్నాడు. నేడు మన ముందున్నది కేవలం ఆర్థిక సంక్షోభమో, ఆరోగ్య సంక్షోభమో కాదు, అది అంతకంటే ప్రమాదకరమైన 'అనుబంధాల సంక్షోభం'.

### ప్రస్తుత వైపరీత్యం : గోడల మధ్య దూరం

ఒకప్పుడు ఇల్లు అంటే నలుగురు మనుషులు కలిసుండే చోటు కాదు, నాలుగు తరాల అనుభవాల వేదిక. నేడు ఆధునికత

పేరిట వెలిసిన 'న్యూక్లియర్' కుటుంబాలు, వ్యక్తిగత స్వేచ్ఛకు ఇస్తున్న అతి ప్రాధాన్యత బంధాలను పలుచన చేస్తున్నాయి. "నేను నా ఇష్టం"అనే ధోరణి పెరిగి, "మనం మన బాధ్యత" అనే భావన కనుమరుగవుతోంది.

సాంకేతికత మన చేతివేళ్లపై ప్రపంచాన్ని ఉంచుతోంది కానీ, పక్కనే కూర్చున్న భార్య బాధనో, బిడ్డ ఆవేదననో గుర్తించలేని 'డిజిటల్ అంధత్వం' వైపు మనల్ని నెడుతోంది. గ్యాడ్జెట్ల స్క్రీన్ల వెలుగులో మనసుల మధ్య చీకటి అలుముకుంటోంది. తల్లిదండ్రులు-పిల్లల మధ్య 'కమ్యూనికేషన్ గ్యాప్' పెరగడం వల్ల భవిష్యత్తు తరాలు విలువలు లేని శూన్యంలోకి జారిపోతున్నాయి.

## ఖుర్ఆన్, ఇస్లాం: పవిత్ర బంధాల పునాది

ఈ విచ్ఛిన్నకర పరిస్థితుల్లో ఇస్లాం, ఖుర్ఆన్ అందించిన కుటుంబ దృక్పథం ఒక శాశ్వత పరిష్కారాన్ని చూపుతుంది. ఇస్లాం కుటుం బాన్ని కేవలం సామాజిక అవసరంగా చూడదు, అదొక ఆధ్యాత్మిక బాధ్యత.

**అన్యోన్యతకు నిర్వచనం :** భార్యాభర్తలు ఒకరికొకరు వస్త్రాల వంటి వారని ఖుర్ఆన్ పేర్కొనడం వెనుక అద్భుతమైన అర్థం ఉంది. వస్త్రం శరీరాన్ని రక్షించినట్లుగా, దంపతులు ఒకరి గౌరవాన్ని మరొకరు కాపాడుకోవాలి. ప్రేమంటే కేవలం ఆకర్షణ కాదు, అది ఒకరి లోపాలను మరొకరు భరిస్తూ సాగే నిరంతర త్యాగం.

**తల్లిదండ్రుల పట్ల దయ :** వృద్ధాప్యంలో తల్లిదండ్రుల పట్ల "దయతో వ్యవహరించండి" అన్న ఖుర్ఆన్ ఆజ్ఞ, నేటి వృద్ధాశ్రమ సంస్కృతికి ఒక బలమైన హెచ్చరిక. తల్లి పాదాల చెంత స్వర్గం ఉందని చెప్పడం ద్వారా స్త్రీ శక్తికి, బాధ్యతకు గౌరవాన్ని ఇచ్చింది.

**పెంపకమే పెట్టుబడి :** పిల్లలను కేవలం ఆర్థిక వనరులుగా చూడకుండా, వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దడం ఒక 'ఇబాదత్' (ఆరాధన) వంటిదని ఇస్లాం బోధిస్తోంది.

## మార్పు ఎక్కడ మొదలవ్వాలి?

కుటుంబ వ్యవస్థ పతనం కాకుండా ఉండాలంటే మనం కొన్ని కీలక మార్పులు చేసుకోవాలి:

**క్వాలిటీ టైమ్ వర్సెస్ క్వాంటిటీ టైమ్ :** గంటల తరబడి కలిసి ఉండటం ముఖ్యం కాదు, ఉన్న కాసేపైనా మొబైల్ ఫోన్లను పక్కన పెట్టి ఒకరి కళ్లలోకి ఒకరు చూస్తూ మాట్లాడుకోవడం ముఖ్యం. సంభాషణలు లేని చోట అనుమానాలు మొలకెత్తుతాయి.

**బాధ్యతతో కూడిన స్వేచ్ఛ :** స్వేచ్ఛ అంటే బాధ్యతారాహిత్యం కాదు. పెంపకంలో పిల్లలకు ప్రేమతో పాటు నియమాలు, స్వేచ్ఛతో పాటు క్రమశిక్షణ నేర్పాలి.

**పారదర్శకత :** ఆర్థిక విషయాల్లో, వ్యక్తిగత సమస్యల్లో కుటుంబ సభ్యుల మధ్య పారదర్శకత ఉండాలి. కష్టాల్ని పంచుకున్నప్పుడే బంధం బలపడుతుంది.

**క్షమాగుణం :** చిన్న చిన్న పొరపాట్లను భూతద్దంలో చూడకుండా, క్షమించే గుణాన్ని అలవరుచుకోవాలి. కుటుంబం అంటే పరిపూర్ణమైన వ్యక్తుల సమూహం కాదు, ఒకరినొకరు అర్థం చేసుకునే అందమైన కలయిక.

## సమాజానికి మూలకణం

కుటుంబం ఆరోగ్యంగా ఉంటేనే సమాజం నిలబడుతుంది. ఒక ఇంట్లో మొదలైన ప్రేమే విశ్వవ్యాప్తమై శాంతిని నెలకొల్పుతుంది. అభివృద్ధి అంటే కేవలం ఆకాశహర్మ్యాల నిర్మాణం కాదు, ఆత్మీయతతో కూడిన గూడును నిర్మించుకోవడం.

సంప్రదాయాన్ని కాపాడటం అంటే పాత కాలంలోకి వెళ్లడం కాదు, పాత కాలపు గొప్ప విలువలను ఆధునిక జీవితానికి అన్వయించుకోవడం. ప్రతి రోజూ మన కుటుంబ సభ్యులకు ప్రాధాన్యతనిస్తూ, వారిని అల్లాహ్ మనకిచ్చిన 'అమానత్'గా భావించినప్పుడే మన జీవితాలకు సార్థకత లభిస్తుంది.

ప్రపంచాన్ని మార్చాలంటే యుద్ధాలు చేయనక్కర్లేదు... ఒక్కసారి ఇంటికి వెళ్లి మీ కుటుంబాన్ని నిండు మనసుతో ప్రేమించండి!

తెలుగు చేతిలో సత్య దీపిక
నిత్య వేదిక
సహజీవన భావనల సాపురాయి
గీటురాయి
వారపత్రిక




**అనంత** నీలాకాశంలో అక్షరాలై మెరుస్తున్న నక్షత్రాలు ఎవరి సంతకం? అగాధ సముద్ర గర్భంలో అలలై ఎగసిపడుతున్న ప్రాణనాదం ఎవరి మంత్రం? గడ్డిపరకను మేసి అమృతం లాంటి పాలను కురిపించే మూగజీవి వెనుక ఉన్న మాయాజాలం ఎవరిది? మనిషి తనను తాను తెలుసుకోవడానికి అడుగులు వేస్తున్న నాటి నుండి, ఈ విశ్వాన్ని నడిపిస్తున్న ఆ 'అదృశ్య హస్తం' కోసం అన్వేషిస్తూనే ఉన్నాడు. కానీ, సృష్టికర్త తన ఉనికిని ఎక్కడో సుదూర తీరాల్లో దాచుకోలేదు, మన కనురెప్పల చాటున, మన గుండె చప్పుడులో, మనం పీల్చే ప్రాణవాయువులో తన సంతకాన్ని నిక్షిప్తం చేశాడు. వివేకమనే కన్ను తెరిచి చూస్తే, ఒక అల్పమైన వీర్య బిందువు అపురూపమైన మానవ రూపంగా మారడం వెనుక ఉన్న ఆ మహాశక్తి మనకు సాక్షాత్కరిస్తుంది.

సృష్టికర్త అన్వేషణలో మనిషి ఆది నుంచీ నిరంతరం శ్రమిస్తూనే ఉన్నాడు. అయితే, కారుణ్యమూర్తి అయిన అల్లాహ్ సృష్టి ఆరంభం నుంచే మనిషికి మార్గదర్శకత్వాన్ని ఏర్పాటు చేశాడు. తన సందేశాలను మోసుకొచ్చే ప్రవక్తలను పంపాడు, దివ్య గ్రంథాలను అవతరింపజేశాడు. వీటన్నింటికీ మించి, సత్యాసత్యాలను విశ్లేషించే బుద్ధిని, విచక్షణా జ్ఞానాన్ని, ఆలోచనా శక్తిని మనిషికి ప్రసాదించాడు. అటు మనిషి అంతరంగంలోనూ, ఇటు బాహ్య ప్రపంచంలోనూ అసంఖ్యాకమైన అద్భుతాలను నిక్షిప్తం చేశాడు. కళ్లే తెరిచి చూస్తే సృష్టికర్తను గుర్తించడం అసాధ్యమేమీ కాదు.

కానీ, దురదృష్టవశాత్తూ కొందరు ఇప్పటికీ దేవుని ఉనికిని ప్రశ్నిస్తూనే ఉన్నారు. "సృష్టి యాదృచ్ఛికంగా జరిగిందని, అన్నీ దానంతట అవే పుట్టుకొచ్చాయని, వాటిని నడిపించే శక్తి ఏదీ లేదని" వారు వాదిస్తారు. "సృష్టికర్త ఉంటే లోకంలో అన్యాయాలు, అకృత్యాలు ఎందుకు జరుగుతున్నాయి?" అని ప్రశ్నిస్తారు. మనిషి తన విచక్షణా జ్ఞానాన్ని నిష్పక్షపాతంగా ఉపయోగిస్తే, ఈ ప్రతి ప్రశ్నకు తార్కికమైన సమాధానం లభిస్తుంది.

### జీవ పరిణామంలో దైవ ముద్ర

మనిషి తన సొంత ఉనికిని గమనిస్తే చాలు. ఒక అల్పమైన

వీర్య బిందువుతో అతని ప్రయాణం మొదలైంది. తల్లి గర్భంలోని చిమ్మ చీకటిలో, ఒక దశ నుండి మరో దశకు మారుతూ అద్భుతమైన ఆకారాన్ని సంతరించుకున్నాడు. ఆ వీర్య బిందువు మాంసపు ముద్దగా, ఆపై ఎముకల గూడుగా మారి, దానిపై కండరాలు, అందమైన చర్మం అమర్చబడి ఒక సంపూర్ణ మానవరూపం రూపుదిద్దుకుంది.

ఈ దేహం లోపల మెదడు, నరాలు, గుండె, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు వంటి సంక్లిష్టమైన అవయవాలు ఏ బాహ్య స్విచ్‌తో సంబంధం లేకుండా నిరంతరం పనిచేస్తూనే ఉన్నాయి. గర్భంలో ఉన్నప్పుడే అతనికి అవసరమైన ఆహారం అందుతూ వచ్చింది. ప్రాణం పోయబడింది. సురక్షితంగా ఈ ప్రపంచంలోకి అడుగుపెట్టిన తర్వాత, అతను పెరిగి పెద్దవవ్వడానికి ప్రకృతిలో అన్ని ఏర్పాట్లు ముందే సిద్ధం చేయబడ్డాయి. ఈ ప్రయాణంలో ఏ చిన్న పొరపాటు జరిగినా మనిషి ఉనికి అంతమయ్యేది. కానీ, ఒక అదృశ్య శక్తి అతడిని ప్రతిక్షణం కాపాడుతూనే ఉంది.

## తర్కానికి అందని సత్యాలు

"సృష్టి అంతా తనంతట తానుగా జరిగిపోయింది" అని వాదించే వారి మాటల్లో ఎంతవరకు వాస్తవం ఉంది? ఒక చిన్న సూది కూడా తయారు చేసేవాడు లేనిదే ఉనికిలోకి రాదు కదా! మరి ఇంతటి సంక్లిష్టమైన మానవ జీవం సృష్టికర్త లేకుండా ఎలా సాధ్యం? దేవుడు లేడని వాదించేవారు, సంతానం కోసం పరితపించే వేలాది దంపతులకు ప్రాణాన్ని ఎందుకు పోయలేక పోతున్నారు?

అలాగే, ఉపాధి విషయంలోనూ మనిషి తన తెలివితేటలను పూర్తిస్థాయిలో ఉపయోగిస్తాడు. లాభం కోసమే ప్రతి అడుగు వేస్తాడు. అయినా కొన్నిసార్లు నష్టం ఎందుకు ఎదురవుతుంది? ఒక వ్యక్తి ఆరోగ్యంగా ఉండాలని సర్వశక్తులూ ఒడ్డుతాడు, కానీ అకస్మాత్తుగా మృత్యువు అతడిని కబళిస్తుంది. ఆధునిక వైద్యం ఉన్నా, మేధావులున్నా ఆ ప్రాణాన్ని ఎందుకు ఆపలేకపోతున్నారు? మనిషికి అత్యంత ఇష్టమైన యవ్వనం అతని చేతుల్లోనే ఉంటే, దానిని ఎందుకు జారిపోనిస్తున్నాడు? ఇవన్నీ ఆలోచిస్తే, మన నియంత్రణలో లేని ఒక అత్యున్నత శక్తి ఈ విశ్వాన్ని నడిపిస్తోందని అర్థం కావడం లేదా?

## ప్రకృతిలో పరమాత్ముని సంకేతాలు

ఒక కోడిగుడ్డును గమనించండి. అందులో ప్రాణం ఉండదు. కానీ కోడి పొదిగిన కొన్ని రోజులకు అందులో నుండి సజీవమైన పిల్ల బయటకు వస్తుంది. నిర్జీవం నుండి జీవాన్ని పుట్టించే శక్తి ఎవరిది? పచ్చగడ్డిని మేసే పశువుల నుండి తెల్లని, పోషక గుణాలున్న పాలు ఎలా వస్తున్నాయి?

అంతేకాదు, అనంతమైన ఆకాశం, సూర్యచంద్రులు, నక్షత్రాలు, మహోన్నతమైన పర్వతాలు, విశాలమైన సముద్రాలు వీటన్నింటిలో ఒక క్రమబద్ధత (Order) ఉంది. సూర్యుడు సమయానికి ఉదయించడం, చంద్రుడు తన కళలను మార్చుకోవడం ఇవన్నీ యాదృచ్ఛికంగా జరుగుతున్నాయా?

## దివ్య గ్రంథం ఏమంటోంది?

వివేకంతో ఆలోచించే ప్రతి మనిషికి సృష్టికర్త ఉనికి స్పష్టమవుతుంది. ఈ పరమ సత్యాన్ని ఖురాన్ గ్రంథం అత్యంత శక్తివంతంగా చాటిచెబుతోంది:

"అల్లాహ్‌యే మిమ్మల్ని పుట్టించాడు, ఆయనే మీకు ఉపాధినిస్తున్నాడు. ఆయనే మీకు మరణాన్ని ప్రసాదిస్తాడు, మరల ఆయనే మిమ్మల్ని పునర్జీవితులను చేస్తాడు." (30:40)

"ఆకాశాల్లో, భూమిపై ఉన్నదంతా ఆయనదే. ఆయనే సర్వ స్వతంత్రుడు, స్తుతింపదగినవాడు." (22:64)

"ఆయన ఏదైనా ఆపద కలిగిస్తే, దానిని తొలగించే శక్తి మరొకరికి లేదు. ఆయన మీకు మేలు చేయాలని తలిస్తే, ఆ అనుగ్రహాన్ని అడ్డుకునే శక్తి ఎవరికీ లేదు." (10:107)

రేయింబవళ్ల మార్పులో, భూమ్యాకాశాల సృష్టిలో, ప్రకృతిలోని ప్రతి అణువులో జ్ఞానవంతులకు అనేక సూచనలు ఉన్నాయి. కళ్లుండి చూడగలిగితే, మనసుండి ఆలోచించగలిగితే ప్రతి సృష్టితంలోనూ సృష్టికర్త సంతకం కనిపిస్తుంది.

దళితుల, మహిళల ఆశల నిధి
అంబుల పొది
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక



# ఆత్మపరిశీలన వెలుగులో నూతన ప్రయాణం

- డాక్టర్ ముహమ్మద్ ఉసామా

**రెప్పపాటులో ఏడాది కరిగిపోయింది. కాలం తన డైరీలో మరో పేజీని తిరగేసింది. క్యాలెండర్ గోడ మీద మారుతుంది సరే.. కానీ నీ బతుకు చిత్రంలో మార్పు వస్తుందా?**

కొత్త ఏడాది అంటే కేవలం అంకెల మార్పు కాదు, అది నీ గతం మీద నువ్వు చేసే సంతకం. నువ్వు చిందించిన చెమట చుక్కల సాక్షిగా, దాచుకున్న కన్నీటి బిందువుల సాక్షిగా.. నిన్ను నువ్వు నిలదీసుకోవాల్సిన సమయం ఇది. అలలు తీరాన్ని తాకినట్టు, నిమిషాలు నీ ఆయువుని తాకి వెళ్తున్నాయి. ముగిసిన ఏడాది నీకు మిగిల్చిన జ్ఞానమేమిటి? నువ్వు పంచిన ప్రేమలో ఉన్న స్వచ్ఛత ఎంత? నువ్వు చేసిన సత్కర్మల సుగంధం ఎక్కడి వరకు చేరింది?

ఒక్కక్షణం ఆగి ఆలోచించు.. నువ్వు కాలం మీద నడుస్తున్నావా? లేక కాలమే నిన్ను తొక్కుకుంటూ వెళ్తోందా? నీ ఆత్మను అద్దం ముందు నిలబెట్టు. 'ముహాసబా' (ఆత్మపరిశీలన) వెలుగులో నీలోని మచ్చల్ని తుడిచేసుకో.. మార్పుని ఆహ్వానించు!

## నిశ్శబ్ద ప్రళయం.. మేల్కొనాల్సిన సమయం

కాలం కేవలం ప్రవాహం లాంటిది కాదు, అది ఒక నిశ్శబ్ద ప్రళయం. అది వెళ్తూ వెళ్తూ మన జీవిత పుటలను తనతో పాటు తీసుకుపోతుంది. క్యాలెండర్ మీద తేదీలు మారిన ప్రతిసారీ మనం సంబరాల్లో మునిగిపోతున్నామా లేక సంశయంలో ఆగి ఆలోచిస్తున్నామా అన్నదే మన విజ్ఞతకు గీటురాయి.

నేటి వేగవంతమైన ప్రపంచంలో మనిషి అన్నింటినీ గమనిస్తున్నాడు కానీ, తనను తాను గమనించుకోవడం మర్చిపోతున్నాడు. 'ముహాసబా-ఎ-నఫ్స్' అంటే కేవలం తప్పుల చిట్టా రాసుకోవడం కాదు, అది ఆత్మకు చేసే శస్త్రచికిత్స. ఇస్లాం దృష్టిలో జీవితం యాదృచ్ఛిక ప్రయాణం కాదు, అది ఒక పరమార్థం ఉన్న యజ్ఞం. గమ్యం తెలియని ప్రయాణికుడు ఎంత వేగంగా పరుగెత్తినా లాభం లేదు. లక్ష్యం లేని జీవితం కూడా అంతే అర్థరహితం. ముహాసబా మనకు ఆ దిశను, స్పష్టతను ప్రసాదిస్తుంది.

## అక్షర సత్యం.. ఆత్మబోధ

ఖుర్ఆన్ మనిషిని హెచ్చరిస్తూ ఒక అద్భుతమైన మాట చెబుతుంది:

"ప్రతి వ్యక్తి తాను రేపటి కోసం ఏమి సమకూర్చుకున్నాడో చూసుకోవాలి."

ఇది కేవలం ఒక సూక్తి కాదు, ఒక జీవన సూత్రం. ఇక్కడ 'రేపు' అంటే కేవలం రాబోయే రోజు మాత్రమే కాదు, మరణానంతర శాశ్వత జీవితం కూడా. మనం చేసే ప్రతి పని, మాట్లాడే ప్రతి మాట ఆ 'రేపటి'ని ప్రభావితం చేస్తాయి. గడిచిన ఏడాదిలో మన ఖాతాలో ఎన్ని పుణ్యాలు చేరాయి? ఎన్ని కన్నీళ్లను తుడిచాం? ఈ లెక్కలు తేల్చు కోకుండా కొత్త సంవత్సరంలోకి అడుగు పెట్టడం అంటే, పాత చిరుగులను దాచుకుంటూ కొత్త బట్టలు కట్టుకోవడమే.

### విచారణా వేదికపై మన వ్యక్తిత్వం

నిజమైన విజయం భౌతిక హోదాల్లో లేదు, అది నైతిక ఎదుగుదలలో ఉంది. ఈ క్రింది ప్రశ్నలు మన గుండె లోతుల్లో ప్రతిధ్వనించాలి:

➤ నా గడిచిన ఏడాది సృష్టికర్తకు ఇష్టమైనదిగా ఉందా లేక నా ఇష్టానుసారంగా సాగిందా?

➤ సేవలో తలవంచానా లేక స్వార్థంలో తలబిరుసుగా ప్రవర్తించానా?

➤ నా తల్లిదండ్రుల కళ్లలో ఆనందాన్ని చూశానా? నా తోటి మనుషులకు భరోసానిచ్చానా?

ఈ ప్రశ్నలు మనల్ని నిలదీస్తున్నప్పుడు వచ్చే సమాధానమే మన రాబోయే ఏడాదికి దిక్సూచి కావాలి. లోపల ఉన్న బలహీనతలను మొలకలోనే తుంచివేసి, ఆధ్యాత్మిక పరిమళాన్ని వెదజల్లే వ్యక్తిత్వాన్ని నిర్మించుకోవడమే ఆత్మ సమీక్ష అంతిమ లక్ష్యం.

### మౌనం నుంచి ప్రయాణం వరకు

ముగిసిన ఏడాది ఒక పాఠం.. రాబోయే ఏడాది ఒక అవకాశం. కాలం మన చేతుల్లో ఉండదు, కానీ కాలంలో మన ప్రవర్తన మన చేతుల్లోనే ఉంటుంది. నూతన సంవత్సరం వేళ బాణసంచా వెలుగుల కంటే, మనసులో వెలిగే ఆత్మపరిశీలన దీపం మిన్న. అది మనకు సరైన మార్గాన్ని చూపిస్తుంది, సృష్టికర్తకు దగ్గర చేస్తుంది.

జ్ఞాని రేపటి కోసం సిద్ధమవుతాడు, అజ్ఞాని నిన్నటి జ్ఞాపకాల్లోనో, నేటి విలాసాల్లోనో మునిగిపోతాడు. నిర్ణయం మనదే!

# మత సామరస్యానికి నిలువుటద్దం :

## పుత్రశోకంలోనూ పరమత విలువల గౌరవం

దేశంలో అక్కడక్కడా మతపరమైన విభేదాలు పొడసూపుతున్న నేటి కాలంలో, బీహార్‌లోని ఒక చిన్న గ్రామం మానవత్వానికి నిలువెత్తు సాక్ష్యంగా నిలిచింది. కన్నకొడుకును కోల్పోయిన పుట్టెడు దుఃఖంలోనూ, తోటి మనుషుల కష్టాన్ని గుర్తించి ఒక హిందూ కుటుంబం చేసిన భూదానం కేవలం ఒక విరాళం మాత్రమే కాదు, అది మత సామరస్యానికి ఒక గొప్ప సందేశం.

### విషాదంలోనూ వెరిసిన కరుణ

బక్సర్ జిల్లా దేబీ దిహ్రా గ్రామానికి చెందిన జనార్దన్ సింగ్ కుమారుడు శివమ్ సింగ్ అకాల మరణం ఆ కుటుంబాన్ని కోలుకోలేని దెబ్బ తీసింది. అయితే, ఆ విషాదాన్ని జనార్దన్ సింగ్ కేవలం కన్నీటితోనే ముగించలేదు. తన కుమారుడి జ్ఞాపకార్థం ఒక గొప్ప కార్యం చేయాలని సంకల్పించారు. తమ ప్రాంతంలోని ముస్లిం సోదరులు ఖనన వాటిక లేక పడుతున్న ఇబ్బందులను గమనించి, తన స్వంత 'ఒక బిఘా' భూమిని వారికి అంకితం చేశారు.

### అంతిమ సంస్కారంలోనూ గౌరవం

"మనిషి ఏ మతానికి చెందినవాడైనా, మరణించాక గౌరవ ప్రదమైన వీడ్కోలు పొందడం ఆ వ్యక్తి హక్కు" అని జనార్దన్ సింగ్ చెప్పిన మాటలు నాగరిక సమాజం నేర్చుకోవాల్సిన గొప్ప పాఠం. గతంలో అక్కడ ఉన్న శ్మశాన స్థలం ప్రభుత్వ పాఠశాల నిర్మాణంతో కనుమరుగైపోవడంతో, స్థానిక ముస్లిం కుటుంబాలు మృతదేహాలను ఐదు కిలోమీటర్ల దూరం మోసుకెళ్లాల్సి వచ్చేది. అధికారుల చుట్టూ తిరిగినా పరిష్కారం దొరకని ఆ సమస్యకు, ఒక తండ్రి తన కుమారుడి స్మృతిలో పరిష్కారం చూపారు.



### సామరస్యపు కమిటీ - ఒక కొత్త ఆదర్శం

ఈ భూమిని కేవలం దానం చేయడమే కాకుండా, దాని నిర్వహణ కోసం హిందూ మరియు ముస్లిం సభ్యులతో కూడిన సంయుక్త కమిటీని ఏర్పాటు చేయడం విశేషం. ఇది రెండు వర్గాల మధ్య పరస్పర నమ్మకాన్ని, సహకారాన్ని పెంపొందిస్తుంది. ఆ భూమిలో పండిన పంట ద్వారా వచ్చే ఆదాయాన్ని ఖననవాటిక అభివృద్ధికి వాడాలని నిర్ణయించడం వారి నిస్వార్థతకు నిదర్శనం.

జనార్దన్ సింగ్ కుటుంబం చూపిన ఈ చొరవ దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. కులమతాల గోడలు కూలిపోయి, మానవత్వం ఒక్కటే నిలబడాలని చాటిచెప్పిన ఈ ఘటన, "మరణంలో లభించే గౌరవం, జీవించే వారికి ధైర్యాన్నిస్తుంది" అనే సత్యాన్ని గుర్తు చేస్తోంది.



# దివ్యమైన దానిమ్మ

- ముహమ్మద్ యాఖూబ్

**పునికా గ్రానాటమ్...** ఈ శాస్త్రీయ నామంతో పిలువబడే దానిమ్మ కేవలం ఒక పండు కాదు; అది చరిత్ర పుటల్లో, పవిత్ర గ్రంథాల్లో నిక్షిప్తమైన ఒక అద్భుతమైన సృష్టి. "స్వర్గపు ఫలం"గా పవిత్ర ఖురాన్‌లో ప్రస్తావించబడిన ఈ ఎరుపు రత్నం, మనకు అల్లాహ్ ప్రసాదించిన అపురూపమైన ఆశీర్వాదం.

ఈ పండు గొప్పదనాన్ని గురించి మనం తెలుసుకోవాల్సిన సమయం ఇది.

## దానిమ్మ : సృష్టి సౌందర్యం

దానిమ్మ స్వస్థలం ఈరాన్ అయినా, నేడు ప్రపంచమంతటా విస్తరించింది. దీని చెట్టు సుమారు తొమ్మిది మీటర్ల ఎత్తు వరకు పెరుగుతోంది. దాని తోలులాంటి గట్టి చర్మం లోపల, ఎరుపు, గులాబీ లేదా తెలుపు రంగులోని లెక్కలేనన్ని మెరిసే జ్యూసి గింజలు (arils) దాగి ఉంటాయి. ఈ దృశ్యం దానిమ్మ సౌందర్యానికి అద్దం పడుతుంది.

దానిమ్మ పూల నుండి తీసే ఆకర్షణీయమైన ఎరుపు రంగు అద్దకం శతాబ్దాలనాటి కళకు చిహ్నం.

## విశ్వాసాలలో దానిమ్మ స్థానం

దానిమ్మ కేవలం పవిత్ర గ్రంథాలకే పరిమితం కాలేదు. ఇది ప్రాచీన సంస్కృతుల ఊహల్లో కూడా మెరిసింది:

**చరిత్ర:** పురాతన ఈజిప్షియన్లు దానిని చికిత్స కోసం ఉపయోగించారు.

సంస్కృతి: చైనీయులు దీనిని అధిక సంతానం, శ్రేయస్సుకు చిహ్నంగా భావిస్తారు.

## ఆరోగ్యం, ఔషధాల నిధి

దానిమ్మ ఒక పోషక నిధి. ఇది అధిక మొత్తంలో విటమిన్ సి, ఫైబర్, శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లతో నిండి ఉంటుంది.

దానిమ్మ రసం హృదయ సంబంధ వ్యాధులను, వృద్ధాప్యాన్ని నివారించే అద్భుత నివారణి'గా పరిగణించబడుతుంది.

యునాని వైద్యం వంటి సాంప్రదాయ పద్ధతుల్లో, విరేచనాలు, చెవి నొప్పి, జ్వరం, అజీర్ణం వంటి అనేక రోగాలకు దీనిని ఔషధంగా వాడుతారు.

## ఖురాన్ మనకు ఇచ్చే స్ఫూర్తి

అరబిక్‌లో 'అర్-రుమ్మాన్' అని పిలువబడే దానిమ్మను ప్రస్తావించిన ఖురాన్ వచనం (6:141), ఈ సృష్టిని ఆస్వాదించడం మాత్రమే కాక, మనం పాటించాల్సిన ధార్మిక బాధ్యతను కూడా గుర్తు చేస్తుంది:

**"అల్లాహ్‌యే నిటారు చెట్లుగల పలు రకాల తోటలనూ, ద్రాక్షతోటలనూ, ఖర్జూరపు తోటలనూ సృష్టించాడు. పొలాలను పండించాడు. వాటి ద్వారా రకరకాల ఆహార పదార్థాలు లభిస్తాయి. జైతూను చెట్లనూ దానిమ్మ చెట్లనూ ఉద్భవింపజేశాడు. వాటి పండ్లు రూపంలో ఒకటే. కాని వాటి రుచి వేరు. అవి పండినప్పుడు వాటి పంటను తినండి. వాటి పంటను కోసేటప్పుడు మీపై ఉన్న అల్లాహ్ హక్కును చెల్లించండి. హద్దులు మీరకండి. హద్దులు మీరే వారిని అల్లాహ్ ప్రేమించడు."**

ఈ వచనం పంచుకోవడాన్ని, త్యాగాన్ని, వృథా చేయకుండా జీవించాలనే అద్భుతమైన జీవన సూత్రాన్ని బోధిస్తుంది.

దానిమ్మ వంటి మొక్కలు మానవుల జంతువుల ప్రయోజనం కోసమే భూమిపై ఉంచబడ్డాయి. ఈ అద్భుతమైన సృష్టి పట్ల మనకు ఉన్న బాధ్యతను ప్రవక్త ముహమ్మద్(స) ఇలా తెలియజేశారు: "ముస్లిములలో ఎవరైనా ఒక చెట్టును నాటినా లేదా విత్తనాన్ని విత్తినా, దాని నుండి ఒక పక్షి, మనిషి లేదా జంతువు తిన్నా, అది వారికి దైవదానం (సదకా) గానే పరిగణించబడుతుంది." (బుఖారీ హదీసు)

ఈ దానిమ్మ సీజన్‌లో, దానిమ్మ గింజలు, రసం లేదా వంటకాల ద్వారా ఈ పోషక నిధిని ఆస్వాదిస్తూ, వృక్షరాజ్యాన్ని సంరక్షించాలనే స్ఫూర్తిదాయక సందేశాన్ని మన హృదయాలలో నింపుకుందాం.❖

# స్వర్గానికి ద్వారం లాంటి నాన్నను నరకానికి మెట్లుగా మార్చుకున్న వైనం!

మేరాజుద్దీన్

**రక్తబంధానికి 'విషం' తలకెక్కిన వేళ : నాన్న అనే నీడను.. నోట్ల కట్టల కోసం అంతమొందిస్తారా?**

కన్నతండ్రి అంటే  కేవలం ఒక వ్యక్తి కాదు.. ఆకాశమంత అనుభవాల పొడిగింపు. బిడ్డల ఎదుగుదల కోసం తన రెక్కల కష్టాన్ని నైవేద్యంగా పెట్టి, వాళ్ల భవిష్యత్తుకు వెలుగునిచ్చే కొవ్వొత్తి ఆయన. "తండ్రి సంతృప్తిలోనే దేవుని ప్రీతి ఉంది.. ఆయనే స్వర్గానికి మధ్య ద్వారం" అని పవిత్ర గ్రంథం ఘోషిస్తుంటే, నేటి కలికాలపు మృగాలు మాత్రం ఆ తండ్రిని కేవలం ఒక 'ఇన్సూరెన్స్ పాలసీ'లా చూస్తున్నాయి.

చెమట చుక్క విలువ తెలియని కొడుకులు, తండ్రి ప్రాణానికి రూ.3 కోట్ల వెల కట్టారు. పచ్చని చెట్టు లాంటి నాన్నను ఆదరించాల్సింది పోయి, పాము కాటుతో కడతేర్చిన ఈ దారుణ ఘటన మానవత్వపు మూలాలనే కదిలిస్తోంది. డబ్బు కోసం కన్నపేగును కాటేసిన ఈ కిరాతకత్వంపై 'మానవీయ కోణంలో' ఒక విమర్శనాత్మక విశ్లేషణ...

కన్నప్రేమ కరువైపోతోంది. రక్తసంబంధం పలచబడుతోంది. ఏ తండ్రి అయితే తన చెమటను ధారబోసి పిల్లల భవిష్యత్తుకు బాటలు వేస్తాడో, అదే తండ్రి ప్రాణాలను ఇన్సూరెన్స్ డబ్బుల కోసం పణంగా పెట్టిన కిరాతకత్వాన్ని చూసి సమాజం తలదించుకుంటోంది. తమిళనాడులో జరిగిన ఈ ఘటన కేవలం ఒక హత్య మాత్రమే కాదు, మానవత్వానికే పట్టిన గ్రహణం.

## నాన్న అంటే పుస్తకం.. కానీ వీరు చింపేసారు!

"నాన్న ఒక పుస్తకం లాంటివాడు.. అందులో అనుభవాల పుటలుంటాయి" అంటారు. తండ్రి తనకంటే తన బిడ్డ గొప్పవాడు కావాలని కోరుకునే ఏకైక నిస్వార్థ జీవి. ప్రవక్త (స) బోధించినట్లు, తండ్రి చిందించే ఒక్క చెమట చుక్కకు కూడా మనం విలువ కట్టలేం. కానీ, ఈ కాలపు ప్రబుద్ధులు తండ్రి ప్రాణానికి రూ. 3 కోట్ల ధర కట్టారు. ఇన్సూరెన్స్ డబ్బుల కోసం పాముతో తండ్రిని కరిపించి చంపడం ఎంతటి పైశాచికం?



హత్యకు గురైన గణేశన్



నిందితులు మోహన్‌రాజ్, హరిహరన్

## ఖురాన్ ఉద్బోధ ఏం చెబుతోంది?

తల్లిదండ్రులు వృద్ధాప్యంలో ఉంటే వారిని విసుగ్గా 'ఉఫ్' అని కూడా అనవద్దని, వారితో మర్యాదగా ప్రవర్తించాలని ఖురాన్ (17:23-24) ఉద్బోధిస్తోంది. 'నా చిన్నతనంలో వారు నన్ను ఎలాగైతే కారుణ్యంతో పెంచారో, ఇప్పుడు వారిపై అలాగే కరుణ చూపు దేవుడా' అని ప్రార్థించాల్సిన కొడుకులు, అదే తండ్రి నిద్రిస్తుంటే కాలకూట విషాన్ని మెడపై ఎక్కించారు.  ఆ కన్నతండ్రి కళ్లలో మరణ వేదనను చూస్తూ ఈ కుమారులు ఎలా ఆనందించగలిగారు?

## స్వర్గానికి ద్వారం.. కానీ వీరు నరకాన్ని ఎంచుకున్నారు!

తల్లి పాదాల దగ్గర స్వర్గం ఉంటే, తండ్రి ఆ స్వర్గానికి 'మధ్య ద్వారం' అని ఇస్లాం చెబుతోంది. ఆ ద్వారాన్ని గౌరవించి, ఆదరించాల్సిన బాధ్యత సంతానానిది. డబ్బు అనే మాయలో పడి ఆ స్వర్గ ద్వారాన్ని శాశ్వతంగా మూసేశారు ఈ కిరాతకులు.

డబ్బు ఈరోజు వస్తుంది, రేపు పోతుంది. కానీ, వెళ్లిన తండ్రి తిరిగి రాడు. భౌతిక సుఖాల కోసం, ఇన్సూరెన్స్ డబ్బుల కోసం కన్నవాళ్లని కాటికి పంపే ఈ ధోరణి సమాజంలో పెరిగిపోతున్న నైతిక పతనానికి నిదర్శనం. ఆధ్యాత్మిక బోధనలు మనసును సంస్కరించనప్పుడు, చదువుకున్న చదువులు విజ్ఞతను నేర్పనప్పుడు ఇలాంటి వికృత చేష్టలు పుట్టుకొస్తూనే ఉంటాయి. నాన్న అనే మహావృక్షాన్ని కూల్చేసిన ఈ 'గొడ్డలి కాడలకు' చట్టం ఇచ్చే శిక్ష కంటే, కన్నతండ్రి ఆత్మ చూసే కన్నీటి శాపమే పెద్ద శిక్ష.

ఆదరించండి.. చంపకండి! ఆయన ప్రేమకు విలువ కట్టండి.. ఇన్సూరెన్స్ డబ్బులకు కాదు.




## గుడ్డుపై అపోహలు వద్దు - ఆహార భద్రతపై స్పష్టత

కోడిగుడ్ల వినియోగం వల్ల క్యాన్సర్ ముప్పు పొంచి ఉందంటూ వస్తున్న వార్తలపై భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (FSSAI) ఇచ్చిన వివరణ హర్షించదగ్గది. గుడ్లలో నైట్రోఫ్యూరాన్ మెటాబోలైట్స్ వంటి హానికర రసాయనాలు ఉన్నాయని, అవి ప్రాణాంతక వ్యాధులకు దారి తీస్తాయని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని FSSAI తేల్చి చెప్పింది. పౌల్ట్రీ పరిశ్రమలో ఇటువంటి రసాయనాల వాడకంపై ఇప్పటికే కఠినమైన నిషేధం అమల్లో ఉంది. ఏదో ఒక చోట జరిగిన నాణ్యత లోపాన్ని సాకుగా చూపి, మొత్తం వ్యవస్థపైనే అనుమానాలు రేకెత్తించడం శాస్త్రీయ దృక్పథం అనిపించుకోదు. సామాన్యుడికి అందుబాటులో ఉండే అతిపెద్ద ప్రొటీన్ వనరు కోడిగుడ్డు. ఇలాంటి పౌష్టికాహారంపై తప్పుడు ప్రచారాలు జరిగితే, అది ప్రజల ఆరోగ్య సూచీపై ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా గర్భిణీలు, బాలింతలు, ఎదుగుతున్న పిల్లలకు గుడ్డు ఎంతో అవసరం. ప్రజలు బాధ్యతా రాహిత్యంగా వచ్చే వార్తలను గుడ్డిగా నమ్మకుండా, అధికారిక సంస్థల ప్రకటనలను గమనించాలి. అదే సమయంలో, పౌల్ట్రీ ఉత్పత్తుల నాణ్యతను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ ప్రజలకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపై ఉంది. ఆరోగ్యకరమైన సమాజం కోసం అపోహలను వీడి, పోషకాహారానికి ప్రాధాన్యత ఇవ్వడమే సరైన మార్గం.

## పల్లెల్లో 'క్లీన్ అండ్ గ్రీన్' అమలయ్యేలా చూడండి: పార్లమెంటరీ కమిటీ

దేశవ్యాప్తంగా పల్లెల్లో పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా కేంద్రం తెచ్చిన 'క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్' కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సిఫార్సు చేసింది. నిధుల కొరత కారణంగా ఈ పథకం అమలులో రాష్ట్రాల మధ్య అసమానతలు ఉన్నాయని గుర్తించిన కమిటీ, దీని కోసం ప్రత్యేకంగా 'క్లీన్ విలేజ్ ఫండ్' ఏర్పాటు చేయాలని, ఒక స్వతంత్ర పారిశుధ్య పథకాన్ని ప్రారంభించాలని కేంద్రానికి సూచించింది. కేవలం మరుగుదొడ్ల నిర్మాణం మాత్రమే కాకుండా, వ్యర్థాల నిర్వహణ, స్వచ్ఛ ఇంధన వాడకంపై మహిళా సంఘాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించాలని, అలాగే సాంకేతికతను జోడించి పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని కమిటీ స్పష్టం చేసింది.

## చిగుళ్ల సమస్యలు.. గుండె జబ్బుకు సంకేతాలు!

నోటి శుభ్రత, చిగుళ్ల ఆరోగ్యంతో ఇతర వ్యాధులు రాకుండా జాగ్రత్త పడవచ్చని గతంలో వివిధ పరిశోధనలలో తెలిపిన శాస్త్రవేత్తలు తాజాగా మరో కీలక విషయాన్ని వెల్లడించారు. ఈ మేరకు అమెరికన్ హార్ట్ అసోసియేషన్, కార్డియో వ్యాస్కులర్ డిసీజ్ ప్రివెన్షన్ కమిటీ శాస్త్రవేత్తలు పరిశోధన పత్రాన్ని విడుదల చేశారు. జన్యు శాస్త్ర పరిశోధనలు, క్లినికల్ ట్రయల్స్, ల్యాబ్ పరీక్షల ఫలితాలు, దశాబ్దాల కాలం నాటి పరిశోధక ప్రచురణలను పరిశీలించి ఈ అధ్యయనం నిర్వహించారు. చిగుళ్ల వ్యాధులు అథెరోస్లెరోటిక్ కార్డియో వాస్క్యులర్ డిసీజ్ (ధమనులు మూసుకుపోవడం) వల్ల కలిగే గుండె సమస్యలు పీరియాంటల్ వ్యాధితో దగ్గర సంబంధం కలిగి ఉన్నాయని తాజా పరిశోధన నివేదికలో స్పష్టం చేశారు. ఇందుకు గల కారణాలను విశ్లేషించారు. దెబ్బ తిన్న చిగుళ్ల ద్వారా శరీరంలోకి బ్యాక్టీరియా ప్రవేశిస్తుందని గుర్తించారు. చిగుళ్ళు, నోటి ఆరోగ్యం దెబ్బ తింటే ప్రమాదకరమైన రక్తనాళాల వాపు సమస్య వస్తుందని పేర్కొన్నారు. పొగ తాగడం, వృద్ధాప్యం, ఊబకాయం కారణంగా చిగుళ్ల వ్యాధులు, ధమనులు మూసుకు పోవడం వంటి సమస్యలు తలెత్తుతాయని వివరించారు.

### ఫారిన్‌కు మన విద్యార్థుల క్యూ....

భారతదేశంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యను అభ్యసించే వారి కంటే, విదేశాలకు వెళ్లి చదువుకోవాలనే ఆసక్తి విద్యార్థుల్లో గణనీయంగా పెరుగుతోందని నీతి ఆయోగ్ నివేదిక వెల్లడించింది. దేశీయంగా ఉన్నత విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాల కొరత, పరిశోధనలకు తగిన ప్రోత్సాహం లేకపోవడం మరియు నాణ్యతా ప్రమాణాలు ఆశించిన స్థాయిలో లేకపోవడమే దీనికి ప్రధాన కారణాలని నివేదిక విశ్లేషించింది. ముఖ్యంగా స్టెమ్ (STEM - సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథ్స్) కోర్సుల కోసం విద్యార్థులు అమెరికా, కెనడా, యూకే వంటి దేశాలకు క్యూ కడుతున్నారు. దీనివల్ల దేశం నుంచి మేధోవలస (Brain Drain) పెరగడమే కాకుండా, భారీగా విదేశీ మారక ద్రవ్యం బయటకు పోతోందని నీతి ఆయోగ్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ పరిస్థితిని అరికట్టేందుకు దేశీయ విద్యా సంస్థల్లో బోధనా ప్రమాణాలను మెరుగుపరచాలని, పరిశోధనలకు పెద్దపీట వేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

సర్వత్రా

## గాజాలో ఆహార సంక్షోభం



గాజాలో ముంచుకొస్తున్న భీకర ఆహార సంక్షోభంపై ఐక్యరాజ్య సమితి (UN) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఇజ్రాయిల్ విధిస్తున్న ఆంక్షలు, యుద్ధ విధ్వంసం కారణంగా గాజాలో 80 శాతం జనాభా ఆకలితో అలమటిస్తున్నారని, వచ్చే ఏడాది నాటికి లక్ష మందికి పైగా చిన్నారులు తీవ్ర పోషకాహార లోపానికి గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించింది. 96 శాతం వ్యవసాయ భూమి నాశనం కావడం, లక్షలాది మంది నివాసాలు కోల్పోవడం, కనీస ఆహార సరఫరా అందకపోవడంతో అక్కడ పౌర జీవనం కుప్పకూలుతోందని యూఎన్ సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఆంక్షలను తొలగించి, మానవతా సాయాన్ని పెద్ద ఎత్తున అనుమతించకపోతే ఈ కరువు మరెంతో మంది ప్రాణాలను బలి తీసుకుంటుందని అంతర్జాతీయ సమాజం హెచ్చరిస్తోంది.

# పర్యావరణ పరిరక్షణలో 'గ్రీన్ ఇస్లాం' విప్లవం: ఇండోనేషియా కొత్త బాట!



ఆధ్యాత్మికతకు పర్యావరణ స్పృహ తోడైతే ఎలాంటి అద్భుతాలు జరుగుతాయో ఇండోనేషియా నేడు ప్రపంచానికి చాటిచెబుతోంది. ఇస్లామిక్ విలువలను పర్యావరణ బాధ్యతతో ముడిపెడుతూ సాగుతున్న "గ్రీన్ ఇస్లాం" ఉద్యమం ఆ దేశ సామాజిక, మతపరమైన ముఖచిత్రాన్ని సమూలంగా మార్చేస్తోంది. అక్రమ కలప నరికివేతకు వ్యతిరేకంగా జారీ చేస్తున్న 'ఫత్వా'ల నుంచి సౌరశక్తితో వెలుగుతున్న మస్జిదుల వరకు.. నేడు అక్కడ ప్రతి అడుగు ప్రకృతి వైపే పడుతోంది.

### ఆదర్శంగా ఇస్తిక్లాల్ మసీదు

ఈ ఉద్యమానికి జకార్తాలోని ప్రసిద్ధ ఇస్తిక్లాల్ మస్జిదు ఆయువుపట్టుగా నిలిచింది. ప్రపంచంలోనే మొట్టమొదటి "పర్యావరణ అనుకూల మస్జిద్" (Ecological House of Worship)గా గుర్తింపు పొందిన ఈ మస్జిదు, సౌర విద్యుత్ మరియు నీటి పునర్వినియోగ వ్యవస్థలతో ఆదర్శంగా నిలుస్తోంది. ఇదే స్ఫూర్తితో దేశవ్యాప్తంగా ఉన్న 8 లక్షల మస్జిదులలో సుమారు 70 శాతాన్ని "ఎకో మస్జిదులు"గా మార్చేందుకు బృహత్తర ప్రణాళికలు సిద్ధమయ్యాయి.

### శిక్షణలో 'గ్రీన్ ఇమామ్‌లు'.. క్షేత్రస్థాయిలో 'గ్రీన్ ఆర్మీలు'

కేవలం కట్టడాలకే పరిమితం కాకుండా, ఈ మార్పు ప్రజల ఆలోచనా విధానంలోకి చొచ్చుకుపోతోంది.

హరిత ప్రసంగాలు: ఖురాన్ పాఠశాలల్లో కాబోయే ఇమామ్‌లకు పర్యావరణ హిత ప్రసంగాలు (Green Sermons) చేయడంలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.

**యువత భాగస్వామ్యం :** యువత నేతృత్వంలోని "ఇస్లామిక్ గ్రీన్ ఆర్మీలు" గ్రామీణ ప్రాంతాల్లో పర్యటిస్తూ సుస్థిర వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రకృతిని రక్షించడం అంటే అల్లాహ్ సృష్టిని గౌరవించడమేనని వారు చాటిచెబుతున్నారు.

### విశ్వాసం - పర్యావరణం: ఒకే లక్ష్యం

ఇండోనేషియా ఉలేమా కౌన్సిల్ సైతం పర్యావరణ నేరాలను తీవ్రంగా పరిగణిస్తూ "గ్రీన్ ఫత్వా"లను జారీ చేసింది. ప్రకృతిని కాపాడటం అనేది కేవలం సామాజిక బాధ్యత మాత్రమే కాదు, అది ఒక ఆధ్యాత్మిక విధి అని ఈ నిర్ణయం స్పష్టం చేస్తోంది. 2060 నాటికి 'కార్బన్ న్యూట్రాలిటీ' సాధించాలన్న ఇండోనేషియా లక్ష్యానికి ఈ మతపరమైన మద్దతు వెన్నెముకలా నిలుస్తోంది.

విశ్వాసం, విద్య, కార్యాచరణ కలిస్తే వాతావరణ సంక్షోభాన్ని ఎలా ఎదుర్కోవచ్చో ఇండోనేషియా నిరూపిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లిం కమ్యూనిటీలకే కాకుండా, పర్యావరణం కోసం పోరాడుతున్న ప్రతి ఒక్కరికీ ఈ 'గ్రీన్ ఇస్లాం' ఒక గొప్ప స్ఫూర్తిదాయక నమూనా.



# 2026 హజ్ యాత్రకు ముందు ఆరోగ్యానికి ప్రాధాన్యం

**ప్రపంచంలోనే** అత్యంత మహత్తరమైన ఆధ్యాత్మిక సమాగమంగా గుర్తింపు పొందిన హజ్ యాత్ర, ప్రతి సంవత్సరం లక్షలాది ముస్లింలను పవిత్ర మక్కా మదీనాల వైపు ఆకర్షిస్తుంది. అయితే, పెరుగుతున్న జనసాంద్రత, వాతావరణ మార్పులు, ఆరోగ్య పరమైన సవాళ్ల నేపథ్యంలో, హజ్ 2026 కోసం సౌదీ అరేబియా ప్రభుత్వం కఠినమైన, తప్పనిసరి ఆరోగ్య మార్గదర్శకాలను జారీ చేయడం గమనార్హం.

ఈ మార్గదర్శకాలు కేవలం నియంత్రణలుగా కాకుండా, యాత్రికుల ప్రాణభద్రతను కాపాడే ముందుచూపు చర్యలుగా చూడాల్సిన అవసరం ఉంది.

## ఆరోగ్యమే మొదటి అర్హత

కొత్త నిబంధనల ప్రకారం, ప్రతి హజ్ యాత్రికుడు తప్పనిసరిగా సంపూర్ణ వైద్య పరీక్ష చేయించుకొని, ఆరోగ్యపరంగా పూర్తిగా ఫిట్ అన్న ధృవీకరణ పత్రం పొందాల్సి ఉంటుంది. ఈ సర్టిఫికెట్ లేకుండా హజ్ వీసా జారీ చేయబోమని సౌదీ అధికారులు స్పష్టం చేశారు.

తీవ్రమైన గుండె వ్యాధులు, కిడ్నీ వైఫల్యం, శ్వాసకోశ సమస్యలు, సంక్రమణ వ్యాధులు, క్యాన్సర్ చికిత్సలో ఉన్నవారు, అలాగే అధిక ప్రమాద గర్భధారణలో ఉన్న మహిళలు, వీరంతా హజ్ యాత్రకు అర్హులు కాదని స్పష్టమైన ఆంక్షలు విధించబడ్డాయి. అలాగే, 12 ఏళ్ల లోపు పిల్లలకు హజ్ అనుమతి లేకపోవడం కూడా ఈ నిబంధనల్లో ఒకటి.

## భక్తి - బాధ్యతతో కూడిన యాత్ర

హజ్ అనేది శారీరకంగా, మానసికంగా ఎంతో శ్రమతో కూడిన యాత్ర. అత్యంత వేడి, భారీ జనసమూహం, నిరంతర ప్రయాణాలు, ఇవన్నీ ఆరోగ్యంగా ఉన్నవారికే సాధ్యమయ్యే అంశాలు. ఈ నేపథ్యంలో, అనారోగ్యంతో యాత్రకు రావడం వ్యక్తిగత ప్రమాదమే కాక, ఇతరుల ఆరోగ్యానికీ ముప్పుగా మారుతుందని సౌదీ ప్రభుత్వం స్పష్టంగా గుర్తుచేస్తోంది.

## వ్యవస్థాపకులపై కూడా బాధ్యత

యాత్రికుల ఆరోగ్య ధృవీకరణను నిర్లక్ష్యం చేసిన హజ్ ఆపరేటర్లు, సేవా సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఇది హజ్ నిర్వహణలో పారదర్శకత, బాధ్యత, క్రమశిక్షణకు పెద్దపీట వేసిన చర్యగా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## ముందుచూపు నిర్ణయం

హజ్ అనేది విశ్వాసానికి ప్రతీక. కానీ ఆ విశ్వాసం ప్రాణాలతో ముడిపడి ఉంది. అందుకే, ఆధ్యాత్మికతతో పాటు ఆరోగ్యాన్ని సమానంగా గౌరవించాల్సిన అవసరం ఉందని హజ్ 2026 మార్గదర్శకాలు స్పష్టంగా తెలియజేస్తున్నాయి.

## అంతిమంగా చెప్పాలంటే

హజ్ 2026 నిబంధనలు కఠినంగా కనిపించినా, అవి లక్షలాది యాత్రికుల భద్రత, సౌకర్యం, పవిత్ర యాత్రను శాంతి యుతంగా నిర్వహించేందుకు తీసుకున్న అవసరమైన చర్యలే. భక్తి, బాధ్యత, ఆరోగ్యం- ఈ మూడింటి సమన్వయమే రాబోయే హజ్‌కు మూలసూత్రంగా మారుతోంది.

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**